

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

### జెసి రాహుల్ కుమార్ రెడ్డి

**ప్రజాశక్తి - భీమవరం**

జిల్లా కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించబోయే స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. మూడు పెద్ద, రెండు చిన్న డయాస్‌లు, ఒక గ్యాలరీ, స్టాల్స్, వివిధ శాఖలకు సంబంధించిన శకటాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రోటోకాల్‌ను అనుసరించి సీటింగ్, స్టేజీ, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను పటిష్టంగా ఏర్పాటు చేశామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, అంబులెన్స్ సేవలు సిద్ధం చేశామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులు వీక్షించేలా ఏర్పాట్లు చేశామన్నారు. డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# ఉచిత సవారీ.. ఆంక్షలెన్నో మరి..!



- పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే అనుమతి
- ఉన్న బస్సులతోనే సర్దుబాటు
- జిల్లా వ్యాప్తంగా 45 వేల మంది మహిళలకు ఉచిత ప్రయాణం
- రూ.15 లక్షలకు పడిపోనున్న ఆర్‌టిసి ఆదాయం
- నేటి నుంచి స్త్రీ శక్తి పథకం అమలు

**ప్రజాశక్తి - భీమవరం**

కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకానికి ఆంక్షలు విధించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మాత్రమే వర్తించే విధంగా నిబంధన విధించింది. రాష్ట్రమంతా ఉచిత ప్రయాణమని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రయాణానికి ఆంక్షలు విధించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చింది. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్రమంతటికీ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఏడాదిపైనే పాలన పూర్తయినప్పటికీ ఈ నెల 15న ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ఉచిత బస్సు సర్వీసులు నడిపే దిశగా ఆర్‌టిసి యంత్రాంగం సమాయత్తమైంది. అయితే ఈ ప్రయాణానికి ప్రభుత్వం ఆంక్షలు విధించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ సర్వీసులు మాత్రమే అనుమతించింది. నాన్‌స్టాప్, అంతర్రాష్ట్ర, కాంట్రాక్ట్ గ్యారేజ్, ప్యాకేజీ టూర్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి లేదు. అలాగే సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్‌లైన్, ఇంద్ర, ఎసి బస్సుల్లోనూ ప్రయాణం కుదరదు.

జిల్లాలో మొత్తం బస్సులు రోజుకు లక్ష కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తుండగా, 82 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో జిల్లా పరిధిలో ప్రయాణిస్తున్న వారు దాదాపు 70 శాతం మంది ఉంటారు. మహిళలకు ఉచిత బస్సు నేపథ్యంలో ఈ ఆక్యుపెన్సీ మరో 15 నుంచి 20 శాతం పెరుగుతుందని ఆర్‌టిసి అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులతో రద్దీ అధికంగా ఉంటుంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఈ రద్దీ మరింత పెరగనుంది. అలాగే పట్టణ ప్రాంతాల్లో లోకల్ సర్వీస్ పెరుగుతుంది. ప్రస్తుతం ఉన్న 23 స్పేర్ బస్సులు, 22 బడి బస్సుల్లో దాదాపు 30 బస్సులను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా రద్దీని అధిగమించే యోచనలో ఆర్‌టిసి అధికారులు ఉన్నారు.

**ఉన్న బస్సులతోనే సర్దుబాటు..**

జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం డిపోల పరిధిలో మొత్తం 295 బస్సులు ఉన్నాయి. వీటిలో దూర ప్రాంతాలకు వెళ్లే వెన్నెల, స్టార్ లైనర్లు నాలుగు, ఇంద్ర బస్సులు 11, సూపర్ లగ్జరీ బస్సులు 33, అల్ట్రా డీలక్స్ 26, ఎక్స్‌ప్రెస్‌లు 20 వరకూ ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల మధ్య సేవలందిస్తున్న అల్ట్రా పల్లె వెలుగు 19, పల్లె వెలుగు 158 ఉండగా, స్పేర్ బస్సులు 23 ఉన్నాయి. జిల్లాలో మొత్తం బస్సుల్లో వెన్నెల సర్వీస్‌తో పాటు ఒక అల్ట్రా డీలక్స్, తొమ్మిది ఎక్స్‌ప్రెస్ బస్సులు, 17 అల్ట్రా పల్లెవెలుగు, 47 పల్లె వెలుగు బస్సులను అద్దె ప్రాతిపదికన నడుపుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో మహిళల జనాభా 9.23 లక్షలు. ప్రస్తుతం వీరి సంఖ్య మరింత పెరిగింది. జిల్లాలో 307 గ్రామాలకు మాత్రమే ఆర్‌టిసి బస్సు సదుపాయం ఉంది. దీనిలో 273 గ్రామాల్లో బస్సులు నడుపుతున్నారు.

28 గ్రామాల్లో కేవలం 2 కిలోమీటర్ల దూరం వరకూ మాత్రమే బస్సులు వెళ్తాయి. కొల్లేటిపాడు, పాందువ, కంద్రిగ, కొల్లేరు, మల్లవరం, పాలమూరు, కానూరు అగ్రహారం గ్రామాలకు అసలు బస్సు సౌకర్యమే లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రయాణించాలంటే ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ సర్వీసులు ఎక్కువగా ఉంటాయి. వీటికి అనుమతి ఇవ్వకుండా కేవలం4 సర్వీసులకు మాత్రమే అనుమతించడం సరికాదని మహిళలు అంటున్నారు.

**రూ.15 లక్షలకు పడిపోనున్న ఆదాయం**

రోజుకు సుమారు 82 వేల మంది బస్సులో ప్రయాణిస్తున్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం 68 శాతం మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మరో 15 శాతం పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆక్యుపెన్సీ నూరు శాతం పెరగనుంది. దీంతో 45 నుంచి 55 వేల మంది మహిళల ప్రయాణికుల సంఖ్య పెరగనుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని ఆర్‌టిసి రోజుకు రూ.38 లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. అయితే ఇది కాస్త రూ.15 లక్షలకు పడిపోనుందని అంచనా వేస్తున్నారు. భీమవరం - రాజమండ్రి, భీమవరం - తాడేపల్లిగూడెం, భీమవరం- తణుకు, భీమవరం - నరసాపురం, భీమవరం- ఏలూరు రూట్లు ఆర్‌టిసికి ఆదాయాన్ని తెస్తున్నాయి. భీమవరం డిపోలోని గణపవరం లైను, నరసాపురంలోని దొడ్డిపట్ల, కందరపల్లి, చినగొల్లపాలెం రూటు, తణుకులోని వరిగేడు, పసలపూడి రూటు, తాడేపల్లిగూడెంలోని అప్పారావుపేట, సింగరాజుపాలెం, పోలవరం మార్గాలు ఆదాయం లేనివిగా ఉండడంతో వీటికి సర్వీసులు అంతంతమాత్రంగానే నడు స్తున్నాయి. ఆదాయం లేని రూట్లలో మహిళల ఉచిత ప్రయాణానికి అదనపు బస్సులు ఏర్పాటు చేస్తారో లేదో వేచిచూడాలి.

## హాస్టల్ నిర్వహణలో అలసత్వం వద్దు

### కలెక్టర్ నాగరాణి

**ప్రజాశక్తి - తణుకు**

వసతి గృహ నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. గురువారం కలెక్టర్ చదలవాడ నాగరాణి తణుకు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం కురిసిన అధిక వర్షాల కారణంగా హాస్టల్లోకి కొద్దిపాటి నీరు చేరడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై దగ్గర్లోని ప్రభుత్వ బిసి కళాశాల బాలికల వసతి గృహానికి తరలించి తాత్కాలిక వసతిని ఏర్పాటు చేశారు. హాస్టల్లోకి నీరు ప్రవేశించిన సమయంలో అక్కడ సంక్షేమ అధికారి లేకపోవడంతో తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్లు పరిస్థితిని చక్కదిద్దడంతో వారిని అభినందిస్తూ, హెచ్‌డబ్ల్యుఒపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ఏ విషయమైనా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని హెచ్చరించారు. హాస్టల్లోని గదులను పరిశీలించి మరమ్మతులు ఉంటే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయ రాజు, సాంఘిక సంక్షేమ వసతి గృహం అధికారి వై.అరుణ, బిసి సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం అధికారి సిహెచ్.కళ్యాణి, తహశీల్దార్ ఉన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

**తణుకు :** తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిని గురువారం కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. గత రెండు సమావేశాలలో ఆసుపత్రి అభివృద్ధిపై సూచించిన పనులు ఎంతవరకూ పూర్తయ్యాయని తెలుసుకొని డ్రెయినేజీ, టాయిలెట్ల నిర్మాణాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలోని బయోకెమిస్ట్ ల్యాబ్, ప్రసూతి వార్డు, అత్యవసర చికిత్స విభాగం, స్త్రీల శస్త్రచికిత్స వార్డు, హైడిఫెన్స్ వార్డు, పిడియాట్రిక్స్ వార్డు, ఆప్తలమిన్ వార్డు, పురుషుల శస్త్రచికిత్స వార్డు తదితర విభాగాలను పరిశీలించి రోగులు, డాక్టర్లతో మాట్లాడారు.కలెక్టర్ వెంట ఆర్ఎంఒ ఎవిఆర్ఎస్.తాతారావు, తహశీల్దార్ డివిఎస్ఎస్ అశోక్‌వర్మ, మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ఉన్నారు.

## నీట మునిగిన పంట పొలాల పరిశీలన

**ప్రజాశక్తి - అత్తిలి (తణుకు)**

భారీ వర్షాల కారణంగా మండలంలోని తిరుపతిపురం, వరిగేడు ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షం లేనందున నీరు తొలగితే పంటకు ఏ విధమైన ఇబ్బందీ ఉండదని తెలిపారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లా సగటు వర్షపాతం 90 మిల్లీ మీటర్ల కాగా బుధవారం ఒక్క రోజునే 1799.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. దీంతో లోతట్టు ప్రాంతాల్లో సుమారు 400 నుంచి 500 ఎకరాల వరకూ పంట పొలాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట అత్తిలి తహశీల్దార్ దశిక వంశీ, ఎంపిపి పోలిశెట్టి చందు, రైతులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు



నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్

# ప్రహసనంలా సహకార కమిటీలు..!

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

- రెండు జిల్లాల్లో 66 సంఘాలకు ఇంకా కమిటీలు నియమించని పరిస్థితి
- రాజకీయ నేతల్లో కొనసాగుతున్న ఉత్కంఠ
- జనవరి 30 వరకూ మాత్రమే త్రిసభ్య కమిటీల గడువు
- తర్వాతైనా ఎన్నికలు నిర్వహిస్తారా అని అనుమానాలు
- రాజకీయ పునరావాసంగా సహకార సంఘాలు
- వ్యవసాయంపై అవగాహన లేనోళ్లకు సహకార పదవులా?

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకం ఒక ప్రహసనంలా మారింది. జులై తొమ్మిదో తేదీన మొదటి జాబితా విడుదలవ్వగా ఇప్పటికీ కమిటీల నియామకం పూర్తికాని పరిస్థితి ఉంది. దీంతో కూటమి నేతల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికీ ఏలూరు జిల్లాలో 47 సంఘాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 19 సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకం పూర్తి కాలేదు. నిబంధనల ప్రకారం జనవరి 30వ తేదీ వరకే త్రిసభ్య కమిటీల పదవీకాలం ఉంది. కమిటీల నియామకం ఆలస్యం కావడంతో తమకు పదవీకాలం విషయంలో నష్టం జరుగుతుందని పదవులు ఆశిస్తున్న నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల తర్వాత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారా.. లేక వైసిపి బాటలోనే త్రిసభ్య కమిటీలతో కూటమి ప్రభుత్వం కాలక్షేపం చేస్తుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. వ్యవసాయంపై అవగాహన లేని వ్యక్తులను త్రిసభ్య కమిటీల్లో నియమించడంపైనా తీవ్ర చర్చ సాగుతోంది. రైతులకు అండగా నిలవాల్సిన సహకార సంఘాలు రాజకీయ పార్టీల నేతలకు పునరావాసంగా మారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాల తీరుతో సహకార సంఘాల ఎన్నికలపై పూర్తిగా నీలినీడలు కమ్ముకున్నాయి. ఏలూరు జిల్లాలో 158, పశ్చిమగోదావరి జిల్లాలో 122 సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు 2013 జనవరిలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరిగాయి. 2018 జనవరితో సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో ఏడాది 2019లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో అప్పట్లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పదవీకాలాన్ని పొడిగించింది. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చింది. దీంతో సహకార సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని అంతా భావించారు. ఐదేళ్లపాటు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ వైసిపి ప్రభుత్వం ముందుకు సాగింది. దీనిపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. త్రిసభ్య కమిటీ నియామకంతో సహకార సంఘాల్లో అవినీతి మరింత పెరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 2024 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఓటమిపాలై, కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలతోపాటు, సహకార సంఘాల ఎన్నిలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అంతా భావించారు.


**ఏడాది కాలం ప్రత్యేక అధికారుల పాలన.. ఇప్పుడు త్రిసభ్య కమిటీలు**

కూటమి అధికారంలోకి వచ్చాక వైసిపి పాలనలో నియమించిన త్రిసభ్య కమిటీలను రద్దు చేసి ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో ఎన్నికలు నిర్వహణ తథ్యమని అంతా భావించారు. ఏడాదిపాటు ప్రత్యేక అధికారుల పాలన సాగించిన కూటమి ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీల నియామకానికి దిగింది. ఇది రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎంఎల్ఎలంతా తమ అనుయాయుల పేర్లను త్రిసభ్య కమిటీలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి పంపించారు. త్రిసభ్య కమిటీల్లో ఛైర్మన్, సభ్యులుగా ఉన్నవారిలో చాలామందికి వ్యవసాయంపై సరైన అవగాహన లేదంటే ఆశ్చర్యపోవాల్సిందే. వ్యాపారాలు, ఇతర వ్యాపకాల్లో ఉండేవారిని సహకార సంఘాల కమిటీల్లో నియమించారు. ఏడాది కాలం తర్వాత త్రిసభ్య కమిటీలను నియమించడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్థం కాలేదు. త్రిసభ్య కమిటీల పదవీకాలం ఆరు నెలలుగా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. జనవరి 30వ తేదీతో గడువు ముగియనుంది. అప్పుడైనా సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో త్రిసభ్య కమిటీల నియామకంలో తాత్సారంపై రాజకీయ పార్టీల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

## ముంచుతున్న వర్షం..

**ప్రజాశక్తి - ఆచంట**

అల్పపీడన ప్రభావంతో గత రాత్రి కురిసిన వర్షాలకు నక్కల, తాడేరు, కొటాలపర్రు, డ్రెయిన్లు ఉధృతంగా మారడంతో ఆచంట, శేషమ్మచెరువు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, వల్లూరు గ్రామాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. డ్రెయిన్ల సమీపంలోని పొలాలన్నీ జలాశయాలను తలపించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా మురుగునీరు కిందికి రావడంతో పంట పొలాల్లో సుమారు మూడు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. ఆచంట వేమవరం, ఆచంట, పెనుమంచిలి రైతుల పరిస్థితి అతివృష్టి లేక అనావృష్టిగా తయారైంది. ముంపు ఏటా పరిపాటిగా మారడంతో అన్నదాతల పరిస్థితి అయోమయంగా తయారైంది. డ్రెయిన్ల ఆధునికీకరణ చేపట్టకపోవడంతో ఏటా ఇదే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రాథమికంగా 725 ఎకరాల్లో పంట పొలాలు మునిగినట్లు మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు తెలిపారు. గోదావరిలో నీరు తక్కువగా ఉన్న నేపథ్యంలో రెండు రోజుల్లోనే నీరు తొలగిపోతుందని, రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు.



పెనుమంచిలిలో నీట మునిగిన పంట పొలాలు

**పెనుమంట్ర:** మండలంలో బుధవారం సాయంత్రం సుమారు 4 గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన కుంభవృష్టి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో పలు లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ కాలనీల్లో ఇళ్లలోకి వర్షపు నీరు వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేక తాగడానికి నీళ్ల లేని దుస్థితి నెలకొంది.

**ఆకివీడు :** బుధవారం రాత్రి భారీ గాలులు వీయడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రాత్రి పది నుంచి 12 గంటల వరకూ ఏక ధాటిగా 2 గంటల పాటు వర్షం కురిసింది. ఈ గాలులకు కుప్పనాపూడి వెళ్లే మార్గంలో, అందే వారి బోధి వద్ద చెట్లు, స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపడడంతో తెల్లవార్లూ విద్యుత్ సరఫరాలేక వినియోగదారుల అవస్థలు పడ్డారు.

**ఆచంట :** అల్పపీడన ప్రభావంతో గత రాత్రి కురిసిన వర్షానికి భారీ వృక్షం నేలకొరిగింది. పెనుమంచిలి జగ్గరాజు కాల్వ పక్కనున్న భారీ వృక్షం నేలకొరగడంతో ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. నేపథ్యంలో గ్రామ సర్పంచి గణేశుల శేషవాణి సుబ్బారావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందితో కలిసి సిపిఎం మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శి సిర్రా నరసింహమూర్తి, మానుకొండ వీర్రాజు, వర్ధనపు శ్రీరాములు, గ్రామ పెద్దలు కర్ని సహదేవుడు, వర్ధనపు రమేష్ వృక్షాన్ని తొలగించే పనులు చేపట్టారు. అలాగే ఆచంటలో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాల నేలకొరిగాయి. దీంతో విద్యుత్తు తీగలు తెగిపోవడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం ఉదయం ఎలక్ట్రికల్ ఎఇ రామారావు ఆధ్వర్యంలో స్తంభాలను నిలబెట్టారు, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

**ఉండి :** గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉండి గోరింతోటలోని మండల పరిషత్ పాఠశాల ప్రాంగణంలోకి నీరు చేరి చెరువులా మారింది. పలు ప్రాంతాలను కలిపే రాష్ట్రీయ రహదారులు పాడైపోవడంతో వాటిలోకి నీరుచేరి కనపడక వాహనదారులు గాయాల పాలవుతున్నారు. ఉండి బస్టాండ్ జలమయం కావడంతో బుధవారం రాత్రి బస్సులు బస్టాండ్‌లోకి రాకుండా బయటి నుంచి వెళ్లిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

**మొగల్తూరు :** మండలంలోని గ్రామాల్లో రెండు రోజులుగా కురిసిన వర్షాలతో వరి నాట్లు నీట మునిగాయి. వర్షపు నీరు చేలల్లో నిలిచిపోయింది. మరి కొన్ని రోజులు ఇలాగే ఉంటే నాట్లు దెబ్బతినే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

## సిబిఐ అధికారి పెద్దిరాజుకు రాష్ట్రపతి పోలీస్ పతకం

### స్వాతంత్ర దినోత్సవం రోజు పతకం అందుకోనున్న పెద్దిరాజు - 32 ఏళ్ల సర్వీసులో ఎన్నో అవార్డులు, రివార్డులు ఆయన సొంతం

**ప్రజాశక్తి - పాలకోడేరు**



సిబిఐ అధికారి పెద్దిరాజు

న్యూఢిల్లీ కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) ప్రధాన కార్యాలయం సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డివిజన్‌లో అదనపు పోలీసు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శృంగవృక్షంలోని బంటుమిల్లి ప్రాంతానికి చెందిన బండి పెద్దిరాజు చేసిన విశిష్ట సేవలకు గాను రాష్ట్రపతి పోలీసు పతకం లభించింది. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక పురస్కారాల్లో రాష్ట్రపతి పోలీసు పతకం ఒకటి. పోలీసు దళం లేక కేంద్ర పోలీసు, భద్రతా సంస్థల్లో అసాధారణ సేవా రికార్డును ప్రదర్శించే వ్యక్తులకు మాత్రమే ఈ పథకం ఇవ్వడం జరుగుతుంది. స్వాతంత్ర దినోత్సవాన్ని పరిష్కరించుకొని పోలీస్ పతకం అందుకోనున్నారు. పెద్దిరాజు 1993లో సిబిఐలో కానిస్టేబుల్‌గా చేరారు. ఇప్పటివరకు ఆయన 150కి పైగా రివార్డ్స్ అందుకున్నారు. 2008లో ఇండియా ఉత్తమ దర్యాప్తు అధికారి గోల్డ్ మెడల్, 2017లో ఇండియన్ పోలీస్ మెడల్ - ఐపిఎం, 2014 - 2018లో రెండు సార్లు అత్యుత్తమ దర్యాప్తు అధికారి అవార్డులు, 2019లో 'డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అవార్డు, ఇండియా సైబర్ కాప్‌ఆఫ్‌ది ఇయర్ వంటి అవార్డులు పొందారు. బంటుమిల్లి విద్యా ట్రస్ట్ పేరుతో సొంత గ్రామంలో ఎనలేని సేవలందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. సిబిఐలో 32 ఏళ్ల పాటు సర్వీసులో ఉన్న పెద్దిరాజు, 1997లో ఎస్ఐ, 2003లో ఇన్‌స్పెక్టర్, 2016లో డిప్యూటీ ఎస్‌పి, 2023లో అడిషనల్ ఎస్‌పిగా ఎంపికయ్యారు. రామర్ హెర్బల్ ఫ్యూయల్ కేసు, పరిటాల రవి హత్యకేసు, న్యాయవాది సతీష్ హత్య, అంతర్రాష్ట్ర నారాయణన్ హత్య కేసులను మద్రాస్ హైకోర్టు అప్పగించింది. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులపై అసభ్యకరమైన సోషల్ మీడియా పోస్టుల కేసులు, బిట్స్ బిలానీ ఆన్‌లైన్ పరీక్ష కుంభకోణం, అంతర్జాతీయ ఆన్‌లైన్ పిల్లల లైంగిక వేధింపుల కేసు, మైక్రోసాఫ్ట్, అమెజాన్‌ను అనుకరిస్తూ అంతర్జాతీయ టెక్ సపోర్ట్ స్కామ్‌లు వంటి హై ప్రొఫైల్ కేసులను ఆయన దర్యాప్తు చేశారు. ఇటీవల ఆయన నీట్ యుజి 2024 ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో చీఫ్ ఇన్వెస్టిగేటింగ్ అధికారిగా పనిచేసి 45 మంది నిందితులను అరెస్టు చేసి సమగ్ర ఛార్జిషీట్‌లను దాఖలు చేశారు.

**సిబిఐ అధికారి పెద్దిరాజుకు అభినందన..**

సిబిఐ అధికారి బండి పెద్దిరాజుకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవకు రాష్ట్రపతి పోలీసు పతకం లభించడం పట్ల శృంగవృక్షం శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, గ్రామాభివృద్ధి కమిటీ హర్షం వ్యక్తం చేశాయి. ఆయన పుట్టిన ఊరికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారని సంఘం అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి రాజా, సోము రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో అభినందించారు.

## ఆదుకోవాలని ఆటో కార్మికుల ఆందోళనలు

**ప్రజాశక్తి - నరసాపురం**

ప్రభుత్వ పథకాల వల్ల ఉపాధి కోల్పోతున్న తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ ఆటో కార్మికులు గురువారం ఆందోళన చేపట్టారు. నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందించారు. తాము ఉచిత బస్సుకు వ్యతిరేకం కాదని, తమ జీవనోపాధిపైనా ప్రభుత్వం దృష్టి పెట్టి ప్రత్యామ్నాయం చూపాలని కోరారు.

**తణుకు:** ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆటోలు బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కామన మునుస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో రంగంపై 12 లక్షల మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని, వారు ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోకపోగా వివిధరూపాల్లో భారాలు వేస్తుందన్నారు. మంత్రి లోకేష్ ఎన్నికల ముందు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసినా అమలు కాలేదని మునిస్వామి అన్నారు. ఆటో కార్మికులను ఆదుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికుల నాయకులు పంది నాగరాజు, కాసగాని సత్యనారాయణ, డి.కనకయ్య, పంది శ్రీను, రేలంగి మెంటయ్య, గాలింపు శ్రీనివాసు, శీలీ అశోక పాల్గొన్నారు.

**భీమవరం టౌన్:** ఆటో కార్మికులు ప్రకాశం చౌక్‌లో నిరసన తెలిపారు. స్వయం శక్తితో జీవనాన్ని సాగిస్తున్న తమకు ఉచిత బస్సు పథకం ఇబ్బంది కల్గిస్తుందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు.



తాడేపల్లిగూడెంలో..



భీమవరంలో ఆటో కార్మికుల నిరసన



నరసాపురంలో..

కార్యక్రమానికి ఆటో యూనియన్ నేతలు ఇంటి సత్యనారాయణ, పంపన గోపి, బేతాళ కమలాకర్, ములుగుర్తి కృష్ణ, ఎం.రవి, గబ్బర్ సింగ్, పాలవలస జగన్మోహన్‌రావు, పోలిశెట్టి సత్యనారాయణ, ఆరేపల్లి బాలాజీ, కె.కుమార్, సురేష్‌స్వామి, సతీష్ నాయకత్వం వహించారు.

**పెనుమంట్ర:** ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ ఆటో కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన గురువారం ఆందోళన చేపట్టారు. ప్రదర్శనగా తహశీల్దార్ కార్యాలయానికి చేరి తహశీల్దార్ వై.రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు మాట్లాడగా, నేతలు కేతా శ్రీను, బొంతు రామకృష్ణ, టి.నాగిరెడ్డి, పీటర్, గంటి వెంకన్న, తేతలి కృష్ణారెడ్డి, సత్యనారాయణ, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో..

**గణపవరం:** గణపవరం, పిప్పరలో ఆటో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఆటో బంద్ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్నేహ ఆటో వర్కర్స్ యూనియన్, అమరావతి ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు విప్పర్తి వెంకటరావు, సకలాబత్తుల శ్యామలరావు మాట్లాడుతూ ఉచిత బస్సుకు తాము వ్యతిరేకంగా కాదన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలోనూ, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు క్యాంపు కార్యాలయంలోనూ వినతిపత్రం అందజేశారు. అనంతరం తాశీల్దార్ కార్యాలయానికి వెళ్లి రెవున్యుఅదికారికి వినతిపత్రం అందజేశారు.

**తాడేపల్లిగూడెం:** పట్టణంలో ఆటో కార్మికులు గురువారం ఆందోళన చేపట్టారు. దీనికి సంఘీభావం తెలిపిన సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూకరోనా అనంతరం రవాణా రంగం తీవ్రంగా దెబ్బతిందన్నారు. ఈ క్రమంలో ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ప్రత్యామ్నాయం చూపాలన్నారు. ఇంధనం, స్పేర్‌పార్ట్స్, ఆర్‌టిఎ ఛార్జీలు, ఇతర పెనాల్టీల ద్వారా రూ.కోట్ల ఆదాయాన్ని పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఎటువంటి సంక్షేమ పథకాలూ ప్రవేశపెట్టలేదని ఎద్దేవా చేశారు. సంక్షేమ బోర్డు గురించి ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. ఉచిత బస్సు వల్ల ఎదురయ్యే నష్టానికి ప్రభుత్వమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కె.రామకృష్ణ, పబ్బాని సురేష్‌కుమార్, కవురెడ్డి శ్రీనివాసరావు, నరమాల కృష్ణ, ఎర్రినాయుడు పాల్గొన్నారు.

**ఉండి:** ఆటో డ్రైవర్లు గురువారం ఉండి మెయిన్ సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరారు.

# పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోరా

## సమస్యపై అడుగుతుంటే బెదిరింపులు

### కొత్తపల్లి నరేష్ వర్మ ఆవేదన

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్ వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరిస్తున్న కొంతమంది అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకసారి వచ్చిన అర్జీ రీ ఓపెన్ అవ్వకుండా చూడాలని



బోదెను పూడ్చిన ప్రాంతాన్ని చూపిస్తున్న నరేష్

పదేపదే చెబుతున్నా అధికారులు కలెక్టర్ ఆదేశాలను సైతం భాఖాతర్ చేస్తున్నారు. పాలకోడేరు గ్రామానికి చెందిన కొత్తపల్లి నరేష్ వర్మ గ్రామంలో వేసిన అక్రమ లేఅవుట్‌పై పిజిఆర్ఎస్‌లో రెండుసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదనడానికి దీనికి నిదర్శనం. గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్ ప్రాంతంలో ఆక్రమించిన బోదెను నరేష్ వర్మ గురువారం చూపించి పిజిఆర్ఎస్‌లో తాను చేసిన ఫిర్యాదు అక్రమ లేఅవుట్‌కు సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించారు. అక్రమ లేఅవుట్ ఏర్పాటుపై గతంలో పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని చెప్పారు. దీనిపై కనీసం స్పందన లేకపోవడంతో తిరిగి ఈనెల 4న మరోసారి అర్జీని అందించానన్నారు. సుమారు 3.7 ఎకరాలలో భూమిని అనుమతులు లేకుండా ప్లాట్లుగా విభజించారన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా పంట బోదెలో రక్షణ గోడ కూడా నిర్మించడం, ఆక్రమించడంతో సాగునీటి ముంపునకు పొలాలకు తీవ్ర ఇబ్బంది ఎదురయ్యే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ ప్రాంతంలో 100 ఎకరాలకుపైగా సాగు భూమి పాడయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించాల్సిన అధికారులు పట్టించుకోకుండా తిరిగి తనపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ ఎంపిడిఒ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బంగారు గోపిని వివరణ కోరగా అనుమతులు లేకుండా లేఔట్లు వేస్తే నిర్మాణాలను తొలగిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లేఔట్లు నెలకొల్పితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 7న చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - ఆచంట

పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలో సెప్టెంబర్ 7వ తేదీన చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభ జరుగుతుందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆచంట వేమవరం కోనిన్ని బట్టల కళ్ళాల మండపంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత సొసైటీ రూ.156 కోట్ల ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు చేనేత వస్త్రాలతో తయారుచేసిన యూనిఫారం అందజేయాలన్నారు. కార్మికులకు జీవనోపాధి కల్పించడం, మరో సాంప్రదాయ చేనేత కలను కాపాడుకోవడానికి రూపొందించిన 11 రకాల రిజర్వేషన్ అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వాసా రామలింగం, గుడిమెట్ల సుబ్బారావు, బోనే నాగకుమార, మాణిక్యం, కాసా ఉమా కోటేశ్వరరావు, అంకంశెట్టి కోట నాగయ్య, పుడక వెంకటేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, వల్ల వీరభద్ర వాసా ప్రదీప్ కుమార్, తమ్ము నాగరాజు, సిర్రాని వెంకటేశ్వరరావు, వాసా కోట మల్లయ్య, వల్ల వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - ఉండి

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యవంతమైన జీవనం ఉంటుందని ప్రకృతి వ్యవసాయం ఎస్ఎస్ ఎ.మహేష్ అన్నారు. గురువారం మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో రైతులకు, మహిళలకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మహేష్ మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించే ఆహారం తీసుకోవాలని సూచించారు. కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం పిచికారీ వల్ల అధిక దిగుబడులు వస్తాయని, ప్రతి ఒక్కరూ ఈ పద్ధతిలో వ్యవసాయం సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది దుర్గ, క్రిష, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

## 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా

**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 13వ తేదీ(రెండవ శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ ఛైర్మన్, పదకొండవ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా తెలిపారు. ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు భార్యాభర్తల మధ్య రాజీ చేసుకోదగిన వివిధ కేసులను ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజీమార్గమే రాజమార్గంగా కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని కక్షిదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# పార్టీలకతీతంగా జనసేనలో స్థానం

## విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం :** పార్టీలకు అతీతంగా జనసేన కుటుంబంలో ప్రతి ఒక్కరికి స్థానం కల్పించి గౌరవిస్తామని విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పెంటపాడు వైసిపికి చెందిన దాసరి శ్రీనివాస్, దాసరి కాశీ సత్యం, సత్యనారాయణ రెడ్డి 50 మంది అనుచరులు మండల అధ్యక్షుడు పుల్లా బాబి అధ్యక్షతన బొలిశెట్టి శ్రీనివాస్ జనసేన కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు జనసేనలో చేరిన ప్రతి ఒక్క జనసైనికునికి జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తరఫున స్వాగతం పలుకుతున్నామని అన్నారు. జనసేన కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరికి వారి కష్టాలలో, సుఖాలలో తోడుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రప్రభుత్వం పల్లెల పటిష్టంగా తయారుచేసిన ఘనత జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు దక్కిందన్నారు. ప్రధాని మోడీ సారథ్యంలో గ్రామ స్వరాజ్యం వెలుగు చూసిందని, దానికి సహకరించిన ప్రతి జనసైనికులు గర్వపడాలన్నారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లా జనసేన కోఆర్డినేటర్ కొటికలపూడి చిన్నారావు, ఉమ్మడి పెంటపాడు మండల అధ్యక్షులు పుల్ల బాబీ, తోట రాజా, మైలవరపు పెదబాబు, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కొప్పిశెట్టి లక్ష్మణ్ రెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# పులివెందులలో టిడిపి గెలుపు అప్రజాస్వామికం : వైసిపి


**నరసాపురం :** కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో టిడిపి గెలుపు అప్రజాస్వామికమని, రాజ్యాంగ వ్యవస్థలను ఖూనీ చేసి గెలుపొందారని వైసిపి నాయకులు విమర్శించారు. పులివెందుల జెడ్‌పిటిసి ఎన్నికల్లో ఓటర్లను ఓటు వేయనీయకుండా అడ్డుకుని దొంగ ఓట్లతో గెలిచారన్నారు. గెలిపించిన వైసిపి బలమైన జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దిగజార్చి ఎన్నికల్లో గెలుపొందడం సిగ్గుచేటన్నారు.

**ఆచంట :** గెలుపొందిన నిమ్మల ఉండాలి కానీ ఓట్లు వేయడానికి వచ్చిన ఓటర్లను అడ్డుకుని ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వైసిపి నాయకులు అన్నారు. ఎన్నికల కమిషన్, న్యాయ వ్యవస్థ ఇప్పటికైనా జోక్యం చేసుకుని జరిగిన తప్పును సరిదిద్దకపోతే ప్రజలకు ఆయా వ్యవస్థలపై నమ్మకం పోయే ప్రమాదం ఉందన్నారు.

# పులివెందుల గెలుపుపై హర్షం

**ఉండి :** పులివెందుల జెడ్‌పిటిసి ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పుకు జగన్ మైండ్ బ్లాక్ అయిందని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు అన్నారు. గురువారం ఉండి నియోజకవర్గంలో పర్యటించిన రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ కాకులు దూరని కారడవి పులివెందులలో బీటెక్ రవి భార్య 6050 ఓట్ల మెజారిటీని తీసుకొచ్చారని, 6, 5 కలిపి 11 వచ్చినా ప్రజాస్వామ్యం కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాడాలి గాని 75 సంవత్సరాల వయసులో ప్రజల కోసం నిత్యం తాపత్రయపడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని విమర్శించడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులను కూటమి నాయకులను బెదిరించడం మాని ప్రజా సమస్యలు ఉంటే అసెంబ్లీలో మాట్లాడాలని సూచించారు.





సభలో మాట్లాడుతున్న రఘురామకృష్ణరాజు

# రైతులకు నిస్వార్థ సేవలు అందించండి

## డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు

**ఉండి :** దేశానికి వెన్నెముకైన రైతుకు నిరంతరం అందుబాటులో ఉంటూ, నిస్వార్థ సేవలు అందిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం మండలంలోని యండగండి విశాల పరపతి సహకార సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న కనుమూరు రఘు రామకృష్ణరాజు, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, మంతెన రామరాజు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన యండగండి కో-ఆపరేటివ్ సొసైటీకి ఛైర్మన్‌గా వ్యవహరించడం అంటే కత్తి మీద సాము లాంటిదని అన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి నిస్వార్థంగా అన్ని రకాల సేవలందిస్తూ సొసైటీని అభివృద్ధి బాటలో నడపాలన్నారు. జాతీయస్థాయి ఉత్తమ సొసైటీగా ఉన్న పేరును కొనసాగించే విధంగా రైతులకు అవసరమైన రుణాలను అందిస్తూ వాటిని సరైన సమయంలో వసూలు చేయాలన్నారు. అనంతరం ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మంతెన రవివర్మ(వేణు) మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కమిటీ సభ్యుల సహకారంతో రైతుల అభ్యున్నతికి కృషిచేస్తూ వారికి అవసరమైన రుణాలు అందజేసి, సకాలంలో వసూలు చేసి సొసైటీని అభివృద్ధి బాటలో నడుపుతానని అన్నారు. కమిటీ సభ్యులు బండారు వీరరాఘవులు, అన్నెపు అప్పారావు ప్రమాణ స్వీకారం చేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు కళ్యాణి

# కార్మిక చట్టాల అమలుకై పోరాటం

## సిఐటియు జిల్లా నాయకులు డి.కళ్యాణి

ప్రజాశక్తి - గణపవరం

కార్మికచట్టాల అమలుకై కార్మికవర్గం పోరాడవలసిన అవసరం ఉందని సిఐటియు జిల్లా నాయకులు డి.కళ్యాణి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బిటి రణదివే భవనంలో జరిగిన సిఐటియు మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభకి బి.రామకోటి, టి.పద్మ, ఆర్.వెంకటరమణ అధ్యక్షత వహించారు. అనంతరం కళ్యాణి మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాన్ని పది గంటలు చేయటం దుర్మార్గమన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతానాల చట్టాన్ని అమలు చేయటం లేదన్నారు. 44 కార్మికచట్టాల్ని 4 కోడ్‌లుగా మార్చుచేసి కార్మికుల గొంతు నొక్కుతుందని విమర్శించారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు విలవిల్లాడుతున్నారని, ధరలను అదుపుచేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయని మండిపడ్డారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్‌గా మేడిశెట్టి పెంటారావు, కో కన్వీనర్‌గా బి.రామకోటి, మరో 17 మందితో నూతన కమిటీ ఏర్పడింది. సభలో సిఐటియు జిల్లా నాయకులు కె.ఝాన్సీ, కౌలురైతు సంఘ సహాయ కార్యదర్శి పెచ్చేటి నరశింహమూర్తి మాట్లాడారు. రానున్నకాలంలో మండలంలో కార్మికుల సమస్యలపై పనిచేయాలని, ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఇబ్బందులు పడుతున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని కోరింది. అన్ని రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో గురువారం స్థానిక డిగ్రీ కాలేజీ లెక్షరర్లు, సిబ్బంది హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ స్వాతంత్ర సాధనకు పోరాటం చేసిన సమరయోధులను గుర్తుచేసుకోవాలని అన్నారు. అనంతరం పోలీస్ ఐలాండ్ వద్ద విద్యార్థులు మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, కెవి.గణేష్, బి.శ్రీనివాస్, సిహెచ్.చైతన్య, జి.వెంకట్రావు, సిహెచ్.అనురాధ, జివి.శారాదదేవి, కె.గిరిబాబు, మోయిన్ అన్సారీ, షేక్ పర్వీన్, పి.భాస్కరావు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** ఎపి నిట్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దేశ భక్తిని, ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగరవేయాలని సూచించారు. కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ శీనివాసన్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ రాజేశ్వర రెడ్డి, డాక్టర్ సునీల్, సాస్ అసిస్టెంట్లు సంధ్య, సాయిరామ్ పాల్గొన్నారు.

# లంకలకోడేరులో వీధి కుక్కల బెడద

## ఆరుగురికి గాయాలు

### నియంత్రించాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్


మండలంలోని లంకలకోడేరు గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. రాజీవ్ కాలనీ, కోడి దుంప లో ఈమధ్యకాలంలో ఆరుగురు కుక్క కాట్లకు గురయ్యారు. వీరిలో పల్లి వెంకటలక్ష్మి, తోటే ఆదాము, నన్నేటి విజయలక్ష్మిలను కుక్క అధికంగా గాయాలు చేయడంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడ డాక్టర్లకు చూపించుకుని వ్యాక్సిన్ వేయించుకున్నారు. పల్లి వెంకటలక్ష్మికి గాయాలు అధికంగా ఉండటంతో రోజంతా ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స చేశారు. మరో ముగ్గురు సన్నిధి విగ్నేష్, మేడిపల్లి రాజేష్, పిల్లి బాబు లంకలకోడేరు ప్రభుత్వాసుపత్రిలో వ్యాక్సిన్స్ తీసుకున్నారు. గ్రామాధికారులు ఇప్పటికైనా వీధి కుక్కలను నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# సొసైటీని అభివృద్ధి పథంలో నడపాలి

## డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్రంలో అభివృద్ధి చెందిన సొసైటీల్లో ఒకటైన కోపల్లె సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎపి డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కోపల్లె సొసైటీ బ్యాంక్ ఛైర్మన్‌గా నంద్యాల రామరాజు(హాట్‌లైన్స్ బాబు), త్రిసభ్య కమిటీ సభ్యులుగా గడి రాము, బుంగా ఆదాములు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ జిల్లాలోని 13 బ్యాంకుల్లో కోపల్లె సొసైటీ బ్యాంకు ఆదర్శంగా ఉందన్నారు. డి పట్టా భూములకు రుణాలు అందించేందుకు సంబంధిత శాఖ అధికారులతో చర్చించి మంత్రుల దృష్టికి తీసుకెళ్తాన్నారు. చేపలు, రొయ్యల మేతలు కొనుగోలు చేసేందుకు రైతులకు సహకార బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తే రైతులు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ నంద్యాల రామరాజు మాట్లాడుతూ ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు, ఆయన తనయుడు భరత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. అన్నిరకాల వ్యాపారాలు నిర్వహించి సొసైటీని ముందుకు తీసుకువెళ్తానన్నారు. అనంతరం రఘురామకృష్ణరాజును వరి కంకులతో తయారుచేసిన దండతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు, జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, సర్పంచి బూడి నాగమణి, ఉప సర్పంచి బూడి వెంకట పత్రాలు, కోపల్లె గ్రామ టిడిపి అధ్యక్షులు దంతులూరి శ్రీనివాసరాజు, బిజెపి కన్వీనర్ కోరా రామూర్తి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు అరేటి వెంకట రత్నప్రసాద్, సహకారశాఖ డిసిఒ మురళీకృష్ణరాజు, సహకార శాఖ సబ్ డివిజనల్ అధికారి జి.సత్యనారాయణ, సొసైటీ సిఇఒ జంపన సాయిగీత పాల్గొన్నారు.



రఘురామకృష్ణరాజును సత్కరిస్తున్న సొసైటీ ఛైర్మన్ రామరాజు

# వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన ఛైర్మన్‌గా మండలంలోని పెదపుల్లేరు గ్రామానికి చెందిన కలిదిండి రామకృష్ణంరాజు(శ్రీను బాబు), వైస్ ఛైర్మన్‌గా పాములపర్రు ఎంపిటిసి యడవిల్లి వెంకటేశ్వరరావును నియమించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వారికి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉండి ఎంఎల్ఏగా 25 సంవత్సరాలు ఏకచక్రాధిపత్యం వహించిన మాజీ మంత్రి కలిదిండి రామచంద్రరాజు తనయుడు రామకృష్ణంరాజుకు స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం ఎఎంసి ఛైర్మన్ పదవి కట్టబెట్టి న్యాయం చేసిందన్నారు. ఉండి ఎఎంసి ఛైర్మన్ పదవిని కూటమి ప్రభుత్వం ఆవిర్భావం తర్వాత ఒసి జనరల్‌కు కేటాయించగా కొన్ని అనివార్య పరిస్థితుల్లో వేరే వారి పేరును ప్రకటించినప్పటికీ అనూహ్య పరిస్థితుల్లో మళ్లీ నేడు కలిదిండి రామచంద్రరాజు తనయుడు రామకృష్ణంరాజు పేరును ఉండి ఎఎంసి ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.



# న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా సూర్యప్రకాశ్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా విన్నా సూర్యప్రకాశ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసెఫ్ తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 143 మంది న్యాయవాదులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని జోసెఫ్ వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన విన్నా ప్రకాష్‌కు 113 ఓట్లు లభించగా ఆయన పై పోటీ చేసిన రొక్కాల గ్లాడ్ స్టన్ కుమార్‌కు 29 ఓట్లు వచ్చాయన్నారు. జూనియర్ కార్యవర్గ సభ్యులుగా పులపర్తి హర్షవర్ధన్, గోరింకల వినోద్ కుమార్, కొల్లాటి ఆదినారాయణ, కంబాల స్వర్ణ ఎన్నికయ్యారని ఆయన వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా బూసి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా వైదాని నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ గా నక్కా ఆనంద్ బాబు, లైబ్రరీ కార్యదర్శిగా నారిన శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శిగా రాయసం రాధారాణి, కోశాధికారిగా పూరిళ్ల శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా గోపిరెడ్డి మణి, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా తంగెళ్ల వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల చంద్రశేఖర్, మహిళా కార్యవర్గ సభ్యులుగా ఓసూరి జ్యోతి మాంగల్య గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన వివరించారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు కానూరి స్వామి నాయుడు, పోలిశెట్టి రఘురాం, పోలిశెట్టి నారాయణ స్వామి(బాబ్జీ), కామన బాల సత్యనారాయణ, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, పోలిశెట్టి సూరిబాబు, ఇంజేటి జాన్ కెన్నెడీ, చల్లా దానయ్య నాయుడు, నూకల వెంకట సుబ్రమణ్యం, జె.సైమన్ విజయ్‌కుమార్, అందే రాజా, అడబాల సుబ్రహ్మణ్యం, సరిపల్లి రామసత్తెయ్య అభినందించారు.

ఎన్నికైన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

# సీనియర్ న్యాయవాది సుబ్బయ్య పాల్ మృతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కప్పల సుబ్బయ్య పాల్(78) గురువారం తన నివాసంలో మృతిచెందారు. సుబ్బయ్య పాల్ నరసాపురం బార్ అసోసియేషన్ సభ్యులుగా నరసాపురం కోర్టులో చాలా సంవత్సరాలు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. కొంతకాలం పాటు ఆయన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా ఆయన సేవలు అందించారు. సుబ్బయ్య పాల్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల నరసాపురం న్యాయవాదుల సంఘం తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. నరసాపురం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బూసి విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి విన్నా ప్రకాష్, మాజీ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు, నల్లమిల్లి జోసెఫ్, న్యాయవాదులు చదలవాడ జ్ఞాన ప్రకాష్, ఇంజేటి జాన్ కెన్నెడీ, పూరిళ్ల శ్రీనివాస్, నారిన శ్రీనివాసరావు, ఉల్లంపర్తి సత్యనారాయణ, నక్కా ఆనంద్ బాబు, పులపర్తి హర్షవర్ధన్, సిహెచ్.వెంకటేశ్వరరావు ఆయన పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుబ్బయ్య పాల్ మృతిపట్ల సీనియర్ న్యాయవాదులు కానూరి స్వామి నాయుడు, పోలిశెట్టి రఘురాం, పోలిశెట్టి నారాయణ స్వామి(బాబ్జీ), కామన బాల సత్యనారాయణ, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, పోలిశెట్టి సూరిబాబు, జిళ్లెళ్ల సైమన్ విజయ్ కుమార్, దేవ రంజిత్ కుమార్, తంగెళ్ల వెంకటేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.

# భవానీ ప్రసాద్‌కు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉత్తమ ఉపాధ్యాయుడు, పాలకొల్లు జివిఎస్‌వి ఆర్‌ఎం ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ ఎక్స్‌లెన్స్ సర్వీస్ అవార్డ్‌కు ఎంపికయ్యారు. పారాచూట్ వరల్డ్ రికార్డ్స్ ఇండియన్ చీఫ్ దాసరి స్వప్న ఈ విషయాన్ని మెయిల్ ద్వారా ధ్రువీకరించారు. విద్యారంగంలో, విద్యాబోధనలో, విద్యా సౌకర్యాల కల్పనలో, విద్యార్థులకు చేస్తున్న సహాయం తదితర సేవలలో భవానీ ప్రసాద్ అత్యుత్తమ పనితీరును కనబరుస్తూ అందరికీ ఆదర్శంగా ఉన్నందుకు ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ అవార్డు రావడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో తన విద్యా సేవలను మరింత విస్తరిస్తామని అన్నారు. దాతలు తనకు అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, పర్మినెంట్ స్కూల్ డోనర్, లయన్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ పిఎస్ డివి.ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త నడపన జగపతి, మానవతావాది కామిశెట్టి అయ్యప్ప నాయుడు, పట్టణ ప్రముఖులు రాయపూడికి అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

## వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

**నరసాపురం :** రైతు సంక్షేమమే ధ్యేయంగా సాగునీటి సంఘాల అధ్యక్షులు, అధికారులు పనిచేయాలని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. అమరావతి నుంచి గురువారం సాగునీటి సంఘాల అధ్యక్షులు, జలవనరులశాఖ అధికారులనుద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. సాగునీటి వినియోగం, సాగునీటి స్థిరీకరణ తదితర అంశాలపై సిఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నదులు, ప్రాజెక్టుల నుంచి నీటిని ఏవిధంగా వినియోగించుకోవాలనే అంశాలపై సిఎం మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్సులో జలవనరులశాఖ ఎఇఇ శ్రీనివాస్, డ్రెయినేజీ శాఖ ఎఇఇ పావన్య, సాగునీటి సంఘాల అధ్యక్షులు పులఖండం వీరరాఘవులు, అడ్డాల శ్రీనివాస్, పెదపాటి శాంతరాజు, తహశీల్దార్ అయితం సత్యనారాయణ పాల్గొన్నారు.

# స్త్రీశక్తి పథకానికి బస్సులు సిద్ధం : మేనేజర్

ప్రజాశక్తి - నరసాపురం

స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు నరసాపురం డిపోలో 48 బస్సులు సిద్ధంగా ఉన్నాయని నరసాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం కింద 31 పల్లె వెలుగులు, 5 ఎక్స్‌ప్రెస్‌లు, 8 ఆల్ట్రా పల్లె వెలుగులు ఈ విధంగా బస్సులను సిద్ధం చేశామన్నారు. నరసాపురం డిపోలో మొత్తం 23 రూట్‌లలో 7 మండలాలు కవర్ చేస్తూ మూడు నియోజకవర్గాల మీదగా ఉచితంగా మహిళలకు బస్సు ప్రయాణాన్ని సిద్ధం చేశామన్నారు.

# నేడు గ్రామసభ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాలలో శుక్రవారం గ్రామసభలు ఏర్పాటు చేశామని డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్ కిరణ్ తెలిపారు. గ్రామ సభలలో మొక్కలకు శాస్త్ర చికిత్సలు, సోలార్ విద్యుత్ వినియోగం తదితర అంశాలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామసభలకు ప్రజలందరూ హాజరుకావాలని సూచించారు.

# స్వాతంత్ర వేడుకలకు ముస్తాబు

**ఆచంట :** 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆచంట పంచాయతీ ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం ఘనంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సర్పంచి కోట సరోజినీ తెలిపారు. వేడుకలకు గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

**మొగల్తూరు :** స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాలు పంచాయతీలను ముస్తాబు చేశారు. మొగల్తూరు పంచాయతీ పాలపర్తివారి పేట, స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో జాతీయపతాకాన్ని వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ ముదునూరి ప్రసాదరాజు ఆవిష్కరిస్తారని ఆ పార్టీ మొగల్తూరు టౌన్ అధ్యక్షులు కుక్కల కృష్ణమోహన్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.



సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆచంట పంచాయతీ

# పలు గ్రామాల్లో వ్యవసాయాధికారుల పర్యటన

## నీటమునిగిన పంటల పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు అందజేసి రైతులను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని పాములపర్రు, కోలమూరు, ఉండి, ఉప్పులూరు, ఎన్ఆర్‌పి అగ్రహారం, పాందువ్వ, పెదపుల్లేరు, చెరుకువాడ గ్రామాలలో మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ పర్యటించి అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ పలు గ్రామాల్లో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సుమారు 1000 ఎకరాలలో పంట నీట మునిగి ముంపుకు గురైనట్లు ప్రాథమిక అంచనా వేయడం జరిగిందని వివరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

**కాళ్ల :** అధిక వర్షాలవల్ల వరి పంటలో కాండం కుళు తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి పి.రమేష్ నాయుడు గురువారం తెలిపారు. కోపల్లె గ్రామంలో వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ రమేష్ నాయుడు మాట్లాడుతూ ఈ శిలీంధ్రం ఆశించడం వల్ల కాండం లోపల, కణుపుల మధ్య భాగం అంతా నల్లగా మారుతుందన్నారు. పిలకలు కిందకు వాలిపోయి ఎండిపోతాయన్నారు. క్రమంగా దుబ్బు అంతా ఎండిపోతుందన్నారు. పూర్తిగా ఎండిన పిలకలు చీల్చి చూస్తే గనుక లోపలి భాగంలో నల్లని చిన్నచిన్న శిలీంధ్ర బీజాలు కనపడతాయన్నారు. మొక్కలు బలహీనంగా ఉండుట, పొలంలో మురుగునీరు పారుదల లేకపోవడం వల్ల ఈ తెగులు ఉధృతి పెరుగుతుందన్నారు. ఈ తెగులు గుర్తించిన మొదటి దశలో హెక్సకనాజోలు లేదా వాలిడమైసిన్ లేదా టేబుకోనజోల్ 2.00 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి 15 రోజులకు ఒకసారి రెండుసార్లు పిలకలు కింద వరకు తడిచేటట్లు ముందు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.



ఉండి : నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న ఎఒ శ్రీనివాస్

**గణపవరం :** అధిక వర్షం వల్ల మండలంలో 1700 ఎకరాలు నీట మునిగినట్లు గణపవరం వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ గురువారం తెలిపారు. మునిగిన వరిచేలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందువల్ల రైతులు తమపంట రక్షణకోసం వరిచేలలో ఉన్న నీటిని బయటకు వెళ్లే విధంగా చూసుకోవాలని అన్నారు. సరిపల్లి, కొత్తపల్లి, గణపవరం, వల్లూరు, కొమ్మర, ఎ.గోపవరం గ్రామాల్లో మునిగిన వరిచేలని ఆయన పరిశీలించారు. నష్టం వివరాలు పైఅధికారులకు పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.

**పెనుమంత్ర :** మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి సోమరాజు ఇల్లెంద్రపర్రు, మల్లిపూడి, జుత్తిగ, మాముడూరు పెనుమంత్ర గ్రామాలలో కొన్ని చోట్ల వరి పంట నీటమునగడంతో మండల వ్యవసాయ శాఖ అధికారిణి బి.దేవీ స్వరూప గురువారం పరిశీలించారు. మండలంలో మొత్తం 12120 ఎకరాలలో వరి సాగులో ఉండగా అందులో 576 ఎకరాలలో వరి పంట నీట మునిగిందని అన్నారు. ఈ నీట మునిగిన ప్రాంతాలలో మండల వ్యవసాయ శాఖ సిబ్బందితో క్షేత్రస్థాయి పరిశీలన చేయడం జరిగిందని, రైతులందరూ అధైర్యపడొద్దని, మురుగునీటి కాలువల ద్వారా నీరు బయటికి పంపాలని ఆమె సూచించారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ
ప్రత్యేక అనుబంధం
ఏలూరు జిల్లా
ఆగస్టు 2025
8 పేజీలు
Advt.feature 2



# అప్రతిహత పురోగమనం..

# ప్రజాశక్తి సొంతం

**ప్రజాశక్తి దినపత్రిక దాదాపు నాలుగున్నర దశాబ్దాలు పూర్తి చేసుకుని 45వ వార్షికోత్సవ ఘట్టంలోకి ప్రవేశించింది. అక్షరాక్షర దీక్షగా.. ఆశయాలే రక్షగా.. నడచొచ్చిన దారులు, గడిచిపోయిన రోజులు.. ఈ సందర్భంలో కళ్ల ముందు కదలాడతాయి. దానితో సన్నిహిత సంబంధం, భాగస్వామ్యం ఉన్న వారికి పత్రిక చరిత్ర, పెరుగుదల కళ్ల ముందు సాక్షాత్కరిస్తాయి.**



తెలుగులో పత్రి కలు ప్రధానంగా సంఘ సంస్కరణలు, స్వాతంత్ర పోరాటం, వామపక్ష ఉద్యమాలు అనే మూడు నేపథ్యాల్లో తొలి అడుగులు వేశాయి. 1942లో ప్రజాశక్తి వారపత్రికగా ప్రారంభమైంది. ఆ విధంగా చూస్తే ఇది 83వ వార్షికోత్సవం కూడా. ఫాసిస్టు యుద్ధాన్ని ఖండి ంచడంలోను, ప్రగతిశీల భావాలను వ్యాపింప జేయడంలోనూ నాటి ప్రజాశక్తి కీలక పాత్ర వహించింది. 1945లో దినపత్రికగా మారింది. సుందరయ్య, కంభంపాటి, మద్దుకూరి వంటి వారి కృషి ఇందులో ఉంది. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, ఉప్పల లక్ష్మణరావు వంటి సుప్రసిద్ధుల రచనలు దానిలో వచ్చేవి. గ్రాంథికం, వ్యవహారం, వాదోపవాదాల మధ్య పత్రికా భాష ఇంకా పూర్తిగా స్థిరపడని ఆ కాలంలో జన సామాన్యానికి అర్థమయ్యే విధంగా రాయడంలో ప్రజాశక్తి భాషకు ఒరవడి, భావాలకు వరిపిడి అయింది. ఇది నచ్చని ఛాందసులు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్–ప్రజాశక్తి పాస్' అని అపహాస్యం చేశారు కూడా! 1946లో ప్రారంభమైన సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రజాశక్తి వాణిగా పనిచేసింది. ప్రభుత్వం 1948లో విజయవాడలోని ప్రజాశక్తి నగర్‌పై దాడి చేసి, విధ్వంసానికి పాల్ప డింది. నిజాం నవాబు క2బాడా హైదరాబాద్ సంస్థానంలో నిషేధించాడు. నూతన స్వాతంత్రం, రాష్ట్రాల ఏర్పాటు, ఎన్నికలు తదితర పరిణామాల మధ్య మళ్లీ 1951లో వారపత్రికగా పున:ప్రారంభమైంది. కొన్నాళ్ల తర్వాత దినపత్రికగా మారి విశాలాంధ్ర పేరుతో పున:ప్రారంభమైంది. మద్దుకూరి చంద్రం, మోటూరు హనుమంతరావు తదితరులు దాని సంపాదకులుగా ప్రసిద్ధులు. ప్రజాశక్తి 1968లో వారపత్రికగా, 1981 ఆగస్టు ఒకటో

..2లో

# అప్రతిహత పురోగమనం.. ప్రజాశక్తి సొంతం

(మొదటి పేజీ నుంచి)

తేదీన దినపత్రికగా అవతరించింది. మోటూరు హనుమంతరావు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య సమక్షంలో నాటి సిపిఎం ప్రధాన కార్యదర్శి ఇఎంఎస్.నంబూద్రిపాద్ దాన్ని ఆవిష్కరించడం ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నట్లుంది. చాలామంది ఈ పత్రిక నడవటం కష్టమని అనేవారు. వారి సందేహాలను పటాపంచలు చేస్తూ అక్షరాయుధంగా పదునెక్కుతూ ప్రజాశక్తి ప్రస్థానం నడిచింది. అంకిత భావం గల నాయకత్వం సంపాదకులు, కార్మికులు, ఉద్యోగ సిబ్బంది సేవలు, ఉద్యమాభిమానులు, పత్రిక శ్రేయోభిలాషుల అండదండలు దాన్ని నిలబెట్టాయి.

ఒక దశలో నాలుగు పేజీలకే పరిమితమైన ప్రజాశక్తి ప్రజల సహకారంతోనే మళ్లీ పురోగమన మార్గం చేపట్టింది. క్రమేణా విస్తరించి 1994లో హైదరాబాదులో రెండో ఎడిషన్ ప్రారంభించింది. అప్పట్లో అదీ నడవదని, అవాస్తవికమని చాలా మంది జోస్యాలు, జాగ్రత్తలు చెప్పారు. అయితే ఇప్పుడు ప్రజాశక్తి ఎనిమిది ఎడిషన్లతో విస్తృతమైన యంత్రాంగంతో, రంగుల యంత్రాలతో ముందుకుపోవడం ఫలప్రదమైన ప్రయోగం. సమస్యలు లేవని కాదు, వనరుల కొరత లేదనీ కాదు. తీవ్రమైన కరోనా తాకిడితో సహా చాలా సంక్లిష్ట సమస్యలే ఎదురయ్యాయి. అంకితభావం గల సిబ్బంది రాజకీయ నైశిత్యం, ఉద్యమాల ఆలంబన, శ్రేయోభిలాషుల అండదండలు ఉంటే సంక్లిష్టమైన సవాళ్లను అధిగమించడం సాధ్యమేనని పత్రిక పురోగమనం నిరూపిస్తోంది.

**మార్పులకు అన్వయించుకుంటూ..**

సామాజిక మార్పులను, సాంకేతిక ప్రగతిని పరిగణనలోకి తీసుకుని ముందుకు పోవడంలోనే ఈ పురోగమన రహస్యం ఉంది. రష్యన్ సోషలిజం ప్లస్ అమెరికన్ మేనేజ్‌మెంటు అని స్టాలిన్ అన్న మాటలు సుప్రసిద్ధం. సంస్కరణలు వాటికవే చెడ్డవి కావు. చెడ్డ సంస్కరణలే ప్రమాదకరమైనవి. సామాజిక మార్పులను, సాంకేతిక ప్రగతిని పరిగణనలోకి తీసుకుని ముందుకు పోవడంలోనే ఈ పురోగమన రహస్యం ఉంది. ప్రజాశక్తి ఆ సూత్రాన్ని అన్వయించుకోవడం వల్లే ప్రగతిశీలవాదులకు వేదిక కాగలిగింది. తమ మౌలిక అభిప్రాయాలకు కట్టుబడి ఉంటూనే లోగోతో సహా అనేక మార్పులు చేసుకుంది.

ఈ నలభయ్యేళ్లలో మీడియా ముఖచిత్రం ఎంతగానో మారింది. ఆధిపత్య శక్తులకు అంగీకార సృష్టి నేటి ప్రపంచాధిపత్య వ్యూహంలో ప్రధానాంశం. ఇందులో పెద్ద పాత్ర మీడియాది. అందుకే ప్రజానుకూల శక్తులు ప్రత్యామ్నాయ మీడియా కోసం గట్టి కృషి చేస్తున్నాయి. అమెరికా వంటి చోట్ల కూడా ప్రత్యామ్నాయ భావజాల కృషి ఉధృతమవుతోంది. తెలుగు మీడియా ముఖ్యుల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రగతిశీల భావాల ప్రేరణ లేనివారు చాలా తక్కువ. అయితే ఇప్పుడు భారతీయ మీడియాలో ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ, సోషల్ మీడియాలోనూ కార్పొరేట్ శాసనం ప్రబలిపోయింది. ఆంక్షల అంకుశాలు, నిరంకుశ పాలకుల శాసనాలు మీడియాను వెంటాడుతుంటే ఆ విలువలు వెలవెలబోతున్నాయి. మరీ ముఖ్యంగా తెలుగునాట ప్రధాన పత్రికలు, ఛానళ్లు రెండు ప్రాంతీయ పాలక పార్టీల మధ్య విభజింపబడి వివాదాల్లో మునిగి తేలుతున్నాయి. దేశం నెత్తిన కూర్చున్న మోడీ అప్రజాస్వామిక పోకడలను బహిర్గతం చేయడం వీటి ఎజెండాలోనే ఉండదు. అంతర్జాతీయంగా అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిఘటించడమూ ఉండదు. పెగాసస్, కాశ్మీర్, రైతాంగ ఆందోళన, యూరప్‌లో మితవాద విజృంభణ ఏదైనా సరే వీటికి అవసరం లేని పని. స్థానిక పాలక పార్టీల ప్రయోజనాలకూ, ఢిల్లీ పెద్దల దృక్పథానికి విరుద్ధమైన విశ్లేషణలూ, పరిశీలనలూ వీటిలో అసలు కనిపించవు. ఈ సోషల్ మీడియా యుగంలో ఇందుకు సంబంధించిన విస్తారమైన సమాచారం ప్రజాస్వామిక మేధావులు, పాత్రికేయులు, రచయితలు తవ్వితీస్తున్నా వీరికి అక్కర్లేదు. ఈ రాష్ట్రంలో తాము బలపర్చే పక్షాన్ని తలకెత్తుకోవడం, అవతలి పక్షంపై దాడి చేయడం, అవసరమైతే అందుకు అవాస్తవాలూ అతిశయోక్తులైనా ప్రధానంగా ప్రచారంలో పెట్టడం నిత్యకృత్యమైంది. ఒకరు అధికారంలో వుంటే మరోవైపు మీడియాపై దాడి చేయడం పరిపాటిగా మారింది. ఇతర వాణిజ్య పోకడలు, సంచలనాలు, సెలబ్రిటీ ముచ్చట్లు సరేసరి. ప్రజాశక్తి వీటికి అతీతంగా ప్రజల ప్రయోజనాలే పరమావధిగా 'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రస్థానం సాగిస్తోంది.

# జాతీయ పతాక నిర్మాత పింగళి



జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య ఆగస్టు 2, 1878న దివి తాలూకా భట్లపెనుమర్రు గ్రామంలో జన్మించారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే కొనసాగింది. 12 సంవత్సరాలకే సెకండరీ విద్య పూర్తిచేసి 19 సంవత్సరాల ప్రాయంలోనే యుద్ధంలో చేరాలనే కోరికతో ముంబై వెళ్ళి సైన్యంలో చేరి ఆఫ్రికాకు వెళ్లారు. అక్కడ గాంధీజీని కలవటం, స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితుడు కావడంతో ఇండియాకు తిరిగి వచ్చారు. అప్పటికే మద్రాసులో ప్లేగు వ్యాధి ప్రబలి ఉండటంతో దేశ ప్రజలను ఆ వ్యాధి నుంచి కాపాడాలన్న తపనతో వ్యాధి నివారణ అధికారిగా పనిచేశారు. 1904లో రష్యాను జపాన్ గెలిచిందన్న వార్త విని వెంకయ్యలోని జిజ్ఞాస మేల్కొని ఇది ఎలా సంభవం, పెద్ద దేశాన్ని ఇంత చిన్నదేశం ఎలా జయించింది అనే తపనతో జపాన్ భాష నేర్చుకుని అనర్గళంగా మాట్లాడారు. జపాన్ వెంకయ్య అని పేరు పెట్టారు ప్రజలు. ఆయనకు ఆ భాష నేర్పిన గురువుకు మన భాషను నేర్పి గురు రుణం తీర్చుకున్నారట వెంకయ్య, వారి పట్టుదల ఎంత దృఢమైనదో యువత గుర్తుంచుకోవాలి. దేశభక్తిగల వెంకయ్య 1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొని నాటి సభాధ్యక్షులైన దాదాబాయి నౌరోజి మన్ననలు పొంది నిర్ణయ సభ సభ్యునిగా గుర్తింపు పొందారు. వ్యవసాయంపై ఆసక్తితో పరిశోధనలు చేసి వ్యవసాయ శాస్త్రం అనే గ్రంథాన్ని ప్రజలకు అందించారు. వారి మేథా సంపత్తి నుంచి మనం ఎంతైనా నేర్చుకోవాల్సివుంది. అందుకే ఆయనను రాజకీయ ద్రష్టగా అభివర్ణించారు పెద్దలు. 1906లో కోల్‌కొతాలో జరిగిన కాంగ్రెస్ సభల్లో ఇంగ్లీషు వారిని పొమ్మంటూనే వారి జెండాను ఉపయోగించటం నచ్చని వెంకయ్య మనకంటూ ఒక జెండా కావాలనే తపనతో భారతదేశ జాతీయ పతాకం అనే గ్రంథాన్ని 1916లో మనకు అందించారు. అప్పుడు వారిని జెండా వెంకయ్యగా పిలిచే వారు. ఇలా చెప్పుకుంటూ పోతే వారి జీవిత విశేషాలు ఎన్నో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. 1921 మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీన బెజవాడలోని గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ మహాసభల్లో శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా మూడు రంగులతో గాంధీజీ సమక్షంలో వెంకయ్య రూపొందించిన జెండాను ఏకగ్రీవంగా కరతాళ ధ్వనుల మధ్య ఆమోదించబడి మొదట రాట్నం ఉన్న, తర్వాత పెద్దలు ధర్మానికి గుర్తుగా అశోకచక్రంతో మన జాతీయ జెండా కీర్తి అనే ఆకాశంలో విహరిస్తూ భారతదేశం మనది అనే స్ఫూర్తిని గర్వంగా చాటుతూ రెపరెపలాడుతోంది.



నారాయణపురం కాలేజీలో

# నాణ్యమైన విద్యే లక్ష్యం

## ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్



ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసు

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తున్నారు ఉంగుటూరు మండలం నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు. ఏలూరు-తాడేపల్లిగూడెం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ కళాశాలకు అనేక గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. 1969లో సర్వోదయ నాయకులు, కీర్తిశేషులు మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు కట్టించిన ఈ కాలేజీకి చదువులో, క్రమశిక్షణలో ఆది నుంచి మంచి గుర్తింపు ఉంది. అదే ఆ గుర్తింపును నేటికీ కొనసాగడం మరో ప్రత్యేకత.

**అడ్మిషన్లు పెంచడంలో అధ్యాపకుల కృషి**

ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయిర్‌లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ కాలేజీలో చేరితే కలిగే ప్రయోజనాలను వారి తల్లిదండ్రులకు వివరించడం వల్లే ఈ విద్యా సంతవ్సరం అడ్మిషన్లు బాగా పెరిగాయి. ఇక్కడ ప్రతి అధ్యాపకుడూ విద్యార్థులను దత్తత తీసుకుని ప్రత్యేక శ్రద్ధ చూపడం మరో ప్రత్యేకత. విద్యార్థులు కళాశాలకు హాజరు కాకపోతే తల్లిదండ్రులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయడం వల్లే అనూహ్యంగా విద్యార్థుల సంఖ్య పెరిగిందనడంలో సందేహం లేదు.

**మట్టిలో మాణిక్యాలను తయారు చేసిన అధ్యాపకులు**

ఈ కాలేజీలో బాగా చదివి ఉన్నత విద్యావంతులైన, పేద ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి అవగాహన కల్పించడం వల్ల 2023-24లో కె.హేమలత 2024-25లో హనుమంతు అజయ్‌రాజు ప్రతిష్టాత్మకమైన విఐటిలో సిఎస్ఇలో ఉచిత సీటు సాధించారు. 2024-25లో జి.హాసిని ఫిషరీస్ యూనివర్సిటీ-నర్సాపూర్‌లో ఉచిత సీటు సాధించారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన వారికి ప్రభుత్వం అందించే షైనింగ్ స్టార్ అవార్డు, రూ.20 వేల నగదుకు ఈ కాలేజీ విద్యార్థి ఎంపికవడం మరో విశేషం. విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దటంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాసు, అధ్యాపకుల సమిష్టి ప్రత్యేక కృషిని అధికారులు అభినందిస్తున్నారు.

**సామాజిక స్పృహ**

చదువుతోపాటు సామాజిక స్పృహ కల్పిస్తున్నారు. రెడ్ రిబ్బన్ క్లబ్ పేరిట 20 మంది విద్యార్థులతో గ్రూపు ఏర్పాటు చేసి ఎయిడ్స్ తదితర ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈగల్ క్లబ్ పేరిట యువత మత్తు మందుకు బానిక కాకుండా అవెర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులందరికీ రాగి జావ, ఆహారం ప్రతి విద్యార్థికి అందేలా అధ్యాపకులు పర్యవేక్షణ చేయడం మరో విశేషం. గత మూడేళ్లుగా ఇంటర్ ఫలితాల్లో జిల్లా స్థాయి ర్యాంకులు నారాయణపురం విద్యార్థులకు చోటు దక్కడం ఇక్కడి అధ్యాపకుల కృషి, పట్టుదల, అంకితభావం కనిపిస్తోందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా చేయడమే లక్ష్యంగా బోధన**

**బివి.శ్రీనివాసు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, నారాయణపురం**

ప్రభుత్వ కాలేజీలో చేరేవారంతా పేద విద్యార్థులే. అలాంటి వారిలో మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేలా మా కళాశాల అధ్యాకులు ఉద్యోగంలా కాకుండా అంకిత భావం, సమాజ సేవే లక్ష్యంగా పనిచేయడం వల్లే ఎన్నో అవార్డులు, ఎచీవ్‌మెంట్స్ సాధించగలుగుతున్నాం. తల్లిదండ్రులతో తరచుగా సమావేశం పెట్టి విద్యార్థుల ప్రగతిని వివరిస్తున్నాం. అటు విద్యార్థి, ఇటు పేరెంట్స్‌కు ప్రభుత్వ కళాశాలపై మక్కువ, బాధ్యత ఉంటోంది. ఇంటర్ ఫలితాల్లో స్టేట్ సెకండ్ ర్యాంకు మా కాలేజీ విద్యార్థే కావడం ఎంతో సంతోషంగా ఉంది.








## తెలుగు పత్రికల పుట్టిల్లు బెజవాడ

తెలుగు పత్రికా రంగానికి విజయవాడను పుట్టినిల్లుగా పేర్కొనవచ్చు. రాజమండ్రి, బందరు, హైదరాబాద్ వంటిచోట్ల కొన్ని ప్రముఖ పత్రికలు వెలువడినప్పటికీ పేరు ప్రఖ్యాతలు పొందిన అగ్రశేణి దినపత్రికలన్నీ ఇక్కడే ప్రచురణ ప్రారంభించాయి. జాతీయోద్యమంతో ప్రారంభించి ఆ తర్వాత కమ్యూనిస్టు సిద్ధాంత శంఖారావం మోగించిన అభ్యుదయ సీమపత్రికల, పుస్తకాల ప్రచురణకు కేంద్రమైన సాహిత్య కేంద్రం. నాటకరంగానికేగాక సినిమా పంపిణీ, జాతీయోద్యమంలో విజయవాడ (నాటి బెజవాడ) ఎప్పుడూ ముందున్నది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1908లో 'స్వరాజ్య' పత్రికను ఇక్కడే స్థాపించారు. జాతీయోద్యమంపై బ్రిటిషు వారి దాడిలో తొలిగా తిలక్‌తోపాటు అరెస్టయిన వ్యక్తి గాడిచర్ల. ప్రజాశక్తి 1942లో మొదటగా ఇక్కడ నుండి ప్రచురణ ప్రారంభించింది. కాశీనాథుని నాగేశ్వరరావు బొంబాయిలో స్థాపించిన 'ఆంధ్ర పత్రిక' తర్వాత కాలంలో మద్రాసుకు మారింది. 'ఆంధ్రప్రభ' కూడా ఇక్కడ నుండే వెలువడేది. గోయెంకా 'ఆంధ్రప్రభ'కు నార్ల వెంకటేశ్వరరావు సంపాదకత్వంలో అనేక కొత్త ఒరవళ్లు పెట్టినా కమ్యూనిస్టు వ్యతిరేకతను నూరిపోసింది. 'ప్రజాశక్తి'ని 1948లో ప్రభుత్వం నాశనం చేయగా నిర్బంధం తర్వాత పున:ప్రారంభమైంది. 1952 తర్వాత 'విశాలాంధ్ర' పత్రిక కమ్యూనిస్టు పత్రికగా అవతరించింది. నార్ల సంపాదకత్వంలో కెఎల్ఎన్ ప్రసాద్ 1960లో 'ఆంధ్రజ్యోతి' స్థాపించారు. గోయెంకా కూడా 'ఆంధ్రప్రభ', ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడలో ప్రారంభించారు. ఆంధ్రపత్రిక కూడా విజయవాడ తరలొచ్చింది. తర్వాత 'ఆంధ్రపత్రిక' హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభించింది. 1967లో సిపిఎం తరపున 'జనశక్తి' పత్రిక నడిచింది. 1974లో విశాఖలో ప్రారంభమైన 'ఈనాడు' తర్వాత హైదరాబాద్‌కు విస్తరించి, 1978లో విజయ వాడ ఎడిషన్ ప్రారంభించింది. ఉగ్రవాదుల విచ్ఛిన్నం తర్వాత 1968లో 'ప్రజా శక్తి' వారపత్రికగా పున:ప్రారంభమై 1981 నుండి దినపత్రికగా వెలువడు తోంది. 1980వ దశకం తర్వాత పత్రికారంగం ఊపందుకుంది. 1984లో 'ఉదయం' ప్రచురణ మొదలైంది. తర్వాత కాలంలో 'ఆంధ్ర భూమి', 'డెక్కన్‌క్రానికల్', 'న్యూస్‌టైమ్', 'వార్త', సూర్య విజయ వాడ ఎడిషన్లు వచ్చాయి.





















# భారత రాజ్యాంగమే సర్వోన్నతం

**75** ఏళ్ల క్రితం అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం కాలపరీక్షకు తట్టుకుని నిలబడింది. 1945 తరువాత స్వాతంత్ర్యం పొందిన అనేక అభివృద్ధిచెందుతున్న దేశాలు, భారత దేశ ఇరుగు, పొరుగు రాజ్యాలు నియంతృత్వ రాజకీయ వ్యవస్థలను కొనసాగిస్తున్నప్పటికీ, భారతదేశం ప్రజాస్వామ్య రాజ్యంగా కొనసాగ డానికి ఒక ముఖ్యకారణం రాజ్యాంగమే. కాని ఇటీవల కాలంలో రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాల పై దాడితోపాటు రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతున్నది. ఉప రాష్ట్రపతిగా రాజీనామా చేసిన జగదీప్ ధన్‌కడ్‌తో సహా అనేకమంది అధికారపార్టీ నాయకులు, పార్లమెంట్ సభ్యులు, సంఘ పరివార్ నాయకులు రాజ్యాంగ వ్యవస్థలపై దాడిచేయడం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నది. అందువలన ఇటీవల సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అనేక సందర్భాలలో 'భారత రాజ్యాంగంమే సర్వోన్నతమైనది' అని ఉద్ఘాటించారు.

## రాష్ట్రాల హక్కులు - సుప్రీంకోర్టు తీర్పు

గత దశాబ్దకాలంలో భారత సమాఖ్యలో రాష్ట్రాల హక్కులు హరిస్తూ, సమాఖ్య స్ఫూర్తిని నీరు గార్చారు. జిఎస్‌టి, పెద్దనోట్ల రద్దు, వ్యవసాయ చట్టాలు, జాతీయ విద్యా విధానం- 2020, జమ్ము-కాశ్మీర్‌కు సంబంధించి 370వ ఆర్టికల్ రద్దు మొదలైన చర్యలన్నీ రాష్ట్రాల హక్కులు హరించడంలో భాగమే. తమిళనాడు ప్రభుత్వం తమ బిల్లులను గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించడంలేదని సుప్రీం కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో 2025 ఏప్రియల్ 8న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్థీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ చారిత్రాత్మకమైన తీర్పు చెప్పారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎస్ రవి 2020-23 మధ్య 12 బిల్లులను ఆమోదించలేదు. రెండు రాష్ట్రపతికి పంపి, 10 బిల్లులను వెనకకు పంపాడు. రాష్ట్ర శాసనసభ ఆ 10 బిల్లులను తిరిగి ఆమోదించి పంపితే, గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు 1952 నుండి యిచ్చిన 18 రాజ్యాంగ ధర్మాసన తీర్పులను, సర్కారియా కమిషన్, పూంచాకమిషన్, రాజమన్నార కమిషన్ నివేదికలను, పరిపాలన సంస్కరణల సంఘం రిపోర్టులను అధ్యయనం చేసి తీర్పు చెప్పింది. తమిళనాడు శాసన సభ ఆమోదించి పంపిన బిల్లులన్నీ ఆమోదం పొందినట్లేనని, ఇక నుండి 3నెలల లోగా బిల్లులకు ఆమోదం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్నది. దీనికోసం సుప్రీంకోర్టు రాజ్యాంగంలో ఆర్టికల్ 142 ఉపయోగించింది.

ఈ తీర్పుపట్ల దేశవ్యాపితంగా ప్రజాస్వామ్య వాదులు హర్షం వ్యక్తంచేశారు. కాని భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితి మీరు ఎలా విధిస్తారు, అని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు వేశారు. రాజ్యాంగంలో 143వ నిబంధన ఉపయోగించి రాష్ట్రపతి ఈ ప్రశ్న వేశారు. సుప్రీంకోర్టు తీర్పుకేంద్ర ప్రభుత్వానికి నచ్చకపోవడం వలనే రాష్ట్రపతి చేత ఈ ప్రశ్నలు అడిగించారని కొంతమంది రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంలో మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్‌ధన్‌గడ్ 'సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్రపతికి ఆదేశాలు జారీ చేసినది. జడ్జీలు సూపర్‌పార్లమెంట్‌గా వ్యవహరిస్తున్నారు.' అని విమర్శించారు. సుప్రీంకోర్టుతీర్పు స్పష్టంగా రాజ్యాంగం సర్వోన్నతం అని చెప్పినది.

## రాజ్యాంగం లౌకిక రాజ్యాంగమే

రాజ్యాంగ పీఠికలో గత 'లౌకిక, సామ్యవాద' భావనలు మొదటినుండి పీఠికలో లేవని, 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారని, వాటిని తొలగించాలని అనేకమంది బిజెపి నాయకులు, బిజెపి పార్లమెంట్ సభ్యులు ప్రకటనలు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ కార్యదర్శి హోసబలె ఇటీవల ఆ మేరకు ప్రకటన చేశారు. ఆ రెండు పదాలు సంఘపరివార్‌కు ఏ మాత్రం నచ్చడం లేదు. రాజ్యాంగ నిర్మాతలు స్పష్టంగా సామ్యవాద, సంక్షేమ రాజ్యస్థాపనకు రాజ్యాంగం 4వ భాగంలో ఆదేశిక సూత్రాలు చేర్చారు. రాజ్యాంగం 3వ భాగంలో ప్రాథమిక హక్కులలో ఆర్టికల్ 25 నుండి 28వరకు మత స్వేచ్ఛను కల్పించి, భారతదేశం లౌకిక రాజ్యంగా ఉండాలని భావించారు. ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి పౌరుడు తనకు నచ్చిన మతాన్ని స్వీకరిం చవచ్చు, ఆచరించవచ్చు, ప్రచారం చేసుకోవచ్చు. 29, 30 ఆర్టికల్స్ ద్వారా భారతదేశంలో మైనార్టీలు తమ భాషను, లిపిని, సంస్కృతిని, విద్యను అభివృద్ధి చేసుకోవడానికి అవకాశాలు కల్పించాయి. అందువలనే సుప్రీంకోర్టు కేశవనందభారతి వర్సెస్ స్టేట్‌ఆఫ్ కేరళ కేసులో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని నిర్వచించి, మౌలిక స్వరూప లక్షణాలలో 'లేకిక వాదాన్ని' కూడా పేర్కొన్నది. సుప్రీంకోర్టు ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో లౌకిక విధానం భారత రాజ్యాంగ ప్రాథమిక లక్షణంగా పేర్కొన్నది. ఆధునిక రాజ్యాలు మత రాజ్యాలుగా ఉంటే నియంతృత్వానికి దారి తీస్తుంది. లౌకిక రాజ్యాలుగా ఉంటేనే ప్రజాస్వామ్య రాజ్యాలుగా ఉండగలుగుతాయని వర్తమాన చరిత్ర నిరూపిస్తుంది.

**అత్యవసర పరిస్థితి - నాడు :** 50 ఏళ్లక్రితం 1975 జూన్ 25న ఆనాటి కేంద్ర ప్రభుత్వం శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో విధించిన అత్యవసర పరిస్థితి దేశంలో నియంతృత్వానికి దారి తీసింది. 352వ నిబంధన ప్రకారం విధించిన అత్యవసర పరిస్థితి ప్రాథమిక హక్కును సస్పెండ్ చేసింది. మీసా, డిఫెన్స్‌ఆఫ్ ఇండియా చట్టాల ద్వారా లక్షలాదిమందిని అరెస్టులు చేసి జైళ్లలో పెట్టారు. 1973నుండి క్షీణించిన ఆర్థిక పరిస్థితులు, నిరుద్యోగం, అవినీతి, 1974 దేశవ్యాప్త రైల్వే సమ్మె, జయప్రకాష్ నారాయణ నాయకత్వంలో అవినీతి వ్యతిరేక ఉద్యమం, బెంగాల్‌లో అర్ధ-ఫాసిస్ట్ టెర్రర్ మొదలైన వాటితో పాటు 1975 జూన్ 12న రాయబరెలీ నియోజక వర్గం నుండి ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు ప్రకటించడం అత్యవసర పరిస్థితికి దారి తీశాయి. 1975-77 మధ్య దేశవ్యాప్తంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు, ఢిల్లీవంటి ప్రదేశాలలో బ్యూటిఫికేషన్ పేరుతో వేలాది ఇళ్లను కూల్చి వేయడం వంటి దారుణాలు, అత్యాచారాలు జరిగాయి. 1977 మార్చిలో జరిగిన ఎన్నికలలో ప్రజలు పరిపక్వత గలిగిన చైతన్యం ప్రదర్శించి అత్యవసర పరిస్థితికి కారణమైన కాంగ్రెస్‌ను, ఇందిరా గాంధీని ఓడించి జనతాపార్టీని, ఇతర పార్టీలను గెలిపిం చాయి. ప్రజలు ప్రాథమిక హక్కులను, రాజ్యాం గాన్ని కాపాడుకుని, రాజ్యాంగమే సర్వోన్నతమైనదని నిరూపి ంచారు.

## అప్రటిత ఎమర్జెన్సీ -నేడు

సమకాలీన భారతదేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని అనేక మంది సామాజిక, రాజ్యాంగ నిపుణులు, ప్రజాస్వామ్య వాదులు భావిస్తున్నారు. నాడు 'మీసా' చట్టం అమలు చేయగా నేడు 'ఉపా' చట్టం క్రింద వేలాది మంది జైళ్లలో ఉన్నారు. ప్రొఫెసర్ సాయిబాబ, ఉమర్‌ఖలీద్ లే దీనికి ఉదాహరణ. భావప్రకటనా స్వేచ్ఛ హరించబడి ప్రాథమిక హక్కులు అణిచివేతకు గురవు తున్నాయి. గౌరి లంకేష్, కల్బుర్గి, గోవిందపన్సార్, నరేంద్రబోల్కర్ హత్యలే దీనికి తార్కాణం. నాడు పేదల గుడిసెలు కూల్చివేస్తే నేడు యుపి తో సహా అనేక రాష్ట్రాలలో బుల్డోజర్ పాలన జరుగుతున్నది. రాష్ట్రల హక్కులపై దాడి జరుగుతున్నది. లౌకిక వాదానికి భంగం కలుగుతున్నది. గోరక్షక దళాలపేరుతో మైనారిటీలు, దళితులపై నిరంతర దాడులు జరుగుతున్నాయి. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ భిన్నమైన రూపాలలో అమలు జరుగుతున్నది. ప్రముఖ పాత్రికేయులు ప్రబీర్ పురకాయస్థ నాడు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యా యలంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకుడిగా అరెస్టు అయితే, నేడు న్యూస్ క్లిక్ సంపాదకుడిగా ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తున్నారనే పేరుతో అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఈ నాటి కేంద్ర ప్రభుత్వ అప్రకటిత ఎమర్జన్సీ విధానాల నుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత రాజకీయపార్టీలు, పౌరసంఘాలు, పౌరసమాజం, మేధావులపై ఉన్నది. రాజ్యాంగం సర్వోన్నతమైనది.

– కెఎస్.లక్ష్మణరావు, మాజీ ఎంఎల్‌సి


















# తెలుగునాట సంస్కరణోద్యమ వేగుచుక్క కందుకూరి

వితంతువుల పేర సాగుతున్న సాంప్రదాయాలకు వ్యతిరేకంగా, వితంతు వివాహాలు చేసేందుకు 1870ల లోనే కందుకూరి వీరేశలింగం తెలుగునాట సంస్కరణ ఉద్యమం నడిపాడు. కష్టాలు, వ్యతిరేకతలు, ఛీత్కా రాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాడు. హేతు వాది, రచయిత, కవితా వైతాళి కుడు అయిన కందుకూరి వీరేశ లింగం వితంతువుల పునరావాస, శరణాలయాలు స్థాపించాడు. బాలికలకు ప్రత్యేకంగా రాజమండ్రిలో పాఠశాల స్థాపించి తెలుగునాట సంస్కరణోద్యమ 'వేగుచుక్క'గా వెలుగొందాడు. చిన్ననాటి నుంచే మూఢనమ్మకాలకు వ్యతిరేకం చిన్నారి బాలికలకు ముసలి వారితో వివాహాలు చేసే రోజులవి. వితంతువులు మరలా పెళ్లి చేసుకోరాదనే మూఢాచారం అమలులో వున్న సాంఘిక పరిస్థితులలో కందుకూరి వీరేశలింగం



1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో సుబ్బారాయుడు, పున్నమ్మ దంపతులకు జన్మించాడు. బడిలో పాఠాలు ఒక్కసారి చదివితే చాలు కంఠతా వచ్చేసేవి. ఇంట్లో అటక మీద వున్న తాటాకు పుస్తకాలు తీసి చదివేవాడు. దాంతో తెలుగు మీద అభిమానం పెంచుకున్నాడు. బడిలో చదువు, సత్ప్రవర్తనలో వీరేశలింగందే అగ్రస్థానం. తాము ఎన్ని ఇబ్బందుల్లో వున్నా తల్లిదండ్రులు వీరేశలింగం చదువును మాత్రం మాన్పించలేదు. వీరేశలింగానికి జబ్బు చేస్తే ఎవరో తన కుమారుడికి చేతబడి చేశారని భూతవైద్యుని పిలిపించి వైద్యం చేయించడానికి ప్రయత్నిం చింది తల్లి. ఆ భూత వైద్యుడిని వీరేశలింగం వివిధ ప్రశ్నలు వేయడంతో అతను భయపడి పారిపోయాడు. ఇంటికి వెళ్లాక అనారోగ్యం పాల య్యాడు. పైగా వీరేశలింగం తనకే చేతబడి చేశాడని భయపడిపోయాడు. దీంతో అతని ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పి ఆరోగ్యం కుదుట పర్చాడు వీరేశలింగం. దెయ్యాలు, భూతాలు లేవంటూ వాదించేవాడు. తోటి వారితో సవాలు చేసి, అమావాస్యనాడు అర్ధరాత్రి శ్మశానానికి వెళ్లి తెల్లవారి తిరిగొచ్చి... ఒక్క దెయ్యం కూడా కనపడలేదని దెయ్యాల పేరుతో భయాలు అనవసరం అని చాటి చెప్పాడు. వీరేశలింగానికి 13వ ఏట ఏడేళ్ల రాజ్యలక్ష్మితో వివాహం జరిగింది. వారిద్దరూ తెలుగు నాట సంస్కరణోద్యమాలకు తోడ్పడ్డారు. వీరేశలింగం రాజమండ్రిలో ఒక సంవత్సరం పాటు ఉపాధ్యాయుడిగా పని చేశాడు. 1872వ సంవత్సరంలో కోరంగిలో ఇంగ్లీషు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగం లభించింది. మూఢ నమ్మకాలు, ఆచారాల మీద నమ్మకాలు మారిపోయాయి. కోరంగి స్కూలులో చేరటానికి అమావాస్య నాడు వెళ్లే ముహూర్తం నిర్ణయించుకున్నాడు. భూమి సూర్యుడు చుట్టు తిరగడం వల్ల ఏర్పడే సంవత్సరం లోని రోజులలో మంచి రోజులు, చెడు రోజులు అనే తేడాలు చూడడం మూఢత్వం, అజ్ఞానమని తన చర్య ద్వారా తెలియచెప్పాడు.

### సంఘ సంస్కరణలు - వితంతు వివాహాలు

సనాతన భావాలు, మత సాంప్రదాయ కుటుంబానికి చెందిన వీరేశలింగం విద్యార్థి దశ లోనే ముఖానికి విభూది రేఖలు, మెడలో లింగకాయ తీసివేశాడు. మత చిహ్నాలను తొలగించుకోవడం ద్వారా ప్రారంభమైన సంస్కరణ కార్యక్రమం... జీవితాంతం అనేక కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా నిరంతరం కొనసాగింది. 1874లో మిత్రులతోకలిసి సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రచారం చేసేందుకు 'వివేకవర్ధని' పత్రికను స్థాపించాడు. తెలుగు ప్రజా సమాజంలో వున్న అవలక్షణాలకు, అధికారుల లంచగొండి తనానికి, మూఢాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. చిన్నప్పుడే పెళ్లయిన అమ్మాయిలు, భర్త చనిపోతే జీవితాంతం వితంతువుగానే పడి ఉండాల్సిందేననే దురాచారం అమలులో వుండేది. దీనిపై చలించిన వీరేశలింగం తన మిత్రులతో కలసి స్త్రీల పునర్వివాహాలను గూర్చి బహిరంగ సభల ద్వారా ప్రచారం చేశాడు. రాజమండ్రిలో మిత్రులతో కలసి 1878 సెప్టెం బరు 8న 'సంఘ సంస్కరణ' సమాజం స్థాపించాడు.

### మూఢాచారాలకు వ్యతిరేకంగా కృషి

స్త్రీల పునర్వివాహం కోసం వీరేశలింగం జరిపిన కృషిని, ప్రచారాలను మొదటి నుండి అనేక మంది వ్యతిరేకించారు. కొన్ని సందర్భాలలో మూర్ఖులు వీరేశలింగంపై ప్రత్యక్ష దాడులకు సిద్ధపడిన సంఘటనలూ వున్నాయి. అభ్యుదయ వాదులైన విద్యార్థులు, యువకులు ఆయనకు తోడ్పడేవారు. వితంతు పునర్వివాహాల గురించి ప్రజలలో బాగా స్పందన వచ్చింది. వధూవరుల కోసం రాత్రిళ్లు ప్రయాణాలు చేయడం, ఆడపిల్లలకు మగవేషాలు వేయడం, వాళ్లను ఎత్తుకొని మైళ్ల కొద్దీ నడవడం వంటి తెగువ చూపాడు. తన ఇంటికి చేరిన వితంతువులను భార్య రాజ్యలక్ష్మితో కలసి కాపాడి వివాహాలు చేశాడు. బంధువులు, మిత్రులు, ఆప్తులు వ్యతిరేకించినా ఇబ్బందులొచ్చినా ఏనాడూ ఒక్కడుగు వెనక్కి వేయలేదు. కొద్ది సంవత్సరాల కాలంలోనే 112 వితంతు వివాహాలు జరిపించాడంటారు. అంతేగాక, స్త్రీ విద్య కోసం బాలికల పాఠశాలలు, కళాశాల నిర్మించాడు. రాత్రి పాఠశాలలు కూడా నడిపాడు. ఆయన జీవితాంతం స్త్రీల అభ్యున్నతి కోసం జరిపిన కృషి ఉత్తుంగ తరంగ సముద్రంలో ఎదురీతగా చెప్పవచ్చు. నేడు దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వరకట్న హత్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులలో విద్యార్థులు, యువతరం అభ్యుదయ వాదులుగా వ్యవహరించాలి. కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో నేటి దురాచార రూపాలకు వ్యతిరేకంగా పని చేయడం ఎంతైనా అవసరం.

**అందమైన బాహ్య రూపం ఎప్పుడైనా మోసం చెయ్యవచ్చు. కానీ విప్లవం పట్ల నిబద్ధత గల ఆత్మ సౌందర్యం ఏనాటికీ మోసం చెయ్యదు.**

**- మావో**

# చదివిన పాఠశాలకే హెచ్‌ఎంగా తోట పోతురాజు


అవగాహనా ర్యాలీలో పాల్గొన్న పోతురాజు, ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి - ఉంగుటూరు**



తాను చదివిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసే అరుదైన అవకాశాన్ని చేబ్రోలుకు చెందిన తోట పోతురాజు సొంతం చేసుకున్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన (1988-89 టెన్త్ బ్యాచ్) పూర్వ విద్యార్థి పోతురాజు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆకివీడు నుంచి నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఆయన తొలి ఉద్యోగం నిడమర్రు మండలం గుణపర్రు. అక్కడ నుంచి పత్తేపురం, పెదనింద్రకొలను, కైకరం, ఎంఎం.పురం పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పనిచేసి హెడ్ మాస్టర్‌గా 2023లో ఉద్యోగోన్నతిపై పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అక్కడ నుంచి సాధారణ బదిలీల్లో ఆయనను నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు అధికారులు ట్రాన్స్‌ఫర్ చేశారు. తాను చదివిన పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా పనిచేసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యాప్రమాణాలు, క్రమశిక్షణతో విద్యను అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పోతురాజు తెలిపారు. పూర్వ విద్యార్థులు, మిత్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు వివిధ సజ్జెక్టుల ఉపాధ్యాయులుగా పనిచేశారు.

**పోతురాజు రాకతో మారిపోయిన రూపురేఖలు**

**పూర్వ విద్యార్థుల వితరణలు**

చేబ్రోలుకు చెందిన పోతురాజు నారాయణపురం హైస్కూల్‌లో చదివారు. ఆయన హెచ్‌ఎంగా వచ్చాక అతని మిత్రబృందం (1988-89 బ్యాచ్) సహకారంతో రూ.35 వేలతో సీసీ కెమెరాలు, మరో పూర్వ విద్యార్థి శీతాల వినాయకరావు దేశనాయకుల ఫొటో ఫ్రేమ్‌లను రూ.ఎనిమిది వేలతో ఏర్పాటు చేశారు. పోతురాజు తన సొంత ఖర్చులతో పాఠశాల కార్యాలయం గది మొత్తాన్ని రీ మోడలింగ్‌తో నూతన హంగులతో అహ్లాదకరంగా తీర్చిదిద్దారు. అమెరికాలో ఉంటున్న యడ్లపల్లి నాగశ్రీను రూ.లక్ష విరాళాన్ని ఇటీవలే అందించారు. వాటిని పాఠశాల మౌలిక సదుపాయాల కోసం వినియోగించనున్నారు. ఈ పాఠశాలలో పదో తరగతి చదవిన విద్యార్థులు గుడ్ల హర్ష ప్రియ, జుత్తుగ అభినయశ్రీలు ట్రిపుల్ ఐటీ సీటు సాధించారు.

**మోడల్ హైస్కూలుగా తీర్చిదిద్దుతా..**

**తోట పోతురాజు, హెచ్‌ఎం, నారాయణపురం జెడ్‌పిహెచ్ స్కూల్**

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు హైస్కూలు హెడ్ మాస్టర్‌గా దాదాపు 1400 మంది విద్యార్థులు, 58 మందికి పైగా ఉపాధ్యాయులతో విజయవంతంగా పాఠశాలను నడిపిన అనుభవంతో నేను చదివిన నారాయణపురం హైస్కూలును మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాను. నా బాల్య మిత్రులు, చిన్ననాటి స్నేహితులు, పూర్వ విద్యార్థుల సహకారంతో మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాను. మరో పక్క ప్రస్తుతం నడుస్తున్న విద్యా సంవత్సరంతో ఈసారి పదో తరగతి ఫలితాల్లో గతం కంటే ఉన్నత స్థితికి తీసుకెళ్లేలా ఉపాధ్యాయుల సహకారంతో కృషి చేస్తున్నాను.

# పాఠశాల ప్రగతికి కృషి


## ఉంగుటూరు జెడ్‌పిహెచ్ స్కూల్ హెచ్‌ఎం రాజారవీంద్ర


ఉంగుటూరు పాఠశాల ప్రవేశ ద్వారం

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

ఉంగుటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు ఎం.రాజారవీంద్ర అన్నారు. ఆయన ఇటీవల ఉద్యోగోన్నతిపై హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉపాధ్యాయులతో వారికి అదనపు క్లాసులు చెప్పించి విద్యాప్రమాణాలు పెంచుతున్నామన్నారు. పాఠశాల గ్రౌండు పల్లంగా ఉండి వర్షాకాలం నీరు నిలిచిపోతోందని, దీనికి పరిష్కారంగా మొన్న వేసవిలో కూటమి ప్రభుత్వం రూ.తొమ్మిది లక్షలతో మెరక పనులు చేయడంతో క్రీడామైదానం సువిశాలంగా ఉండి విద్యార్థులు ఆడుకోవటానికి ఎంతో అనువుగా ఉందని చెప్పారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కోసం నిధుల మంజూరు కోరుతూ ఎంఎల్‌ఎ ధర్మరాజుకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. రోడ్డు భద్రతా వింగ్ డిఐజి సిహెచ్.విజయరావు ఈ పాఠశాల పూర్వ విద్యార్థి కావడం విశేషం. ఆయన సొంతూరు ఉంగుటూరు పక్కనే ఉన్న నీలాద్రిపురం గ్రామమే.


మెరక చేసిన ఉంగుటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా మైదానం



**విప్లవ పథంలో పయనించే వీరయోధులు,**
**ప్రతి పరాజయం నుంచీ కొత్త శక్తిని కూడగట్టుకుంటారు.**
**చరిత్ర ప్రవాహంలో ఎంతగా ఈదులాడితే,**
**మనోధైర్యం అంతగా పెరుగుతుంది.**

- కార్ల్ మార్క్స్

# 'మానస'లో ఉన్నత విద్యాప్రమాణాలు

## హైస్కూల్ ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్


మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్


రవీంద్రకుమార్


మోక్షిత్ సాయి జశ్వంత్


యు.నాగ సాత్విక్


పి.బాంధవ్య

ప్రజాశక్తి - భీమడోలు

మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉన్నత విద్యాప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్నామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సుమారు 90 మంది విద్యార్థులతో 2002లో మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రారంభించినట్లు వివరించారు. ఆ రోజుల్లోనే భీమడోలు వంటి గ్రామంలో ఉన్నత విద్యాప్రమాణాలతో బోధన సాగించడంతో అందరి దృష్టి ఆకర్షించిందన్నారు. గ్రామస్థాయి విద్యార్థులకు విలువైన విద్యను అందించడం మాత్రమే కాకుండా విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలను సాధించేలా గత 23 సంవత్సరాలుగా పనిచేస్తుందని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు అందుబాటులో ఉండే ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య, ఐఐటి, నీట్ ఫౌండేషన్, సాంస్కృతిక అంశాలు, వసతులు, బస్సులు వంటి అన్ని సౌకర్యాలను అందిస్తుందన్నారు. ఇప్పటికే ఇక్కడ చదువుకుని వెళ్లిన విద్యార్థులు ఎందరో ఐఐటి, నిట్, నీట్ ర్యాంకులు సాధించడం, ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో మంచి ఉద్యోగాలు సాధించడం, విదేశాల్లో సైతం ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సాధించారని వివరించారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు మంచి విద్యతోపాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తన, మానవత్వం, సామాజిక స్పృహ, విలువలు కలిగి ఉండేలా మొందటి నుంచి శిక్షణ ఇస్తు న్నామని చెప్పారు. నేటి పోటీ ప్రపంచానికి కావాల్సిన కంప్యూటర్ శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీష్ భాషపై పట్టు, మూడో తరగతి నుంచే కాంపిటేటివ్ పరీక్షల విధానంలో తరచూ పరీక్షలు నిర్వహించడం, విద్యార్థులకు మానసిక వికాసానికి కావాల్సిన అనేక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల శారీరక వికాసానికి అలాగే పోటీతత్వాన్ని పెంపొందించడానికి చాలా రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తున్నట్లు రవీంద్రకుమార్ వివరించారు. ఇలా అన్ని రంగాల్లోనూ కచ్చితమైన విధానాలు పాటించడాన్ని గుర్తించిన అప్పటి కలెక్టర్ 2017లో రాష్ట్ర ప్రభుత్వం తరపున తనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా ఇచ్చారని తెలిపారు. భీమడోలు గ్రామంలో విద్యార్థులకు మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఒక విలువైన విద్యకు వేదికగా మారి ఇప్పుడు రెండు వేల మందికి పైగా విద్యార్థులకు విద్యను అందిస్తూ అ ప్రాంతంలోనే నెంబర్ వన్ స్కూలుగా నిలిచిందని చెప్పారు.